PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 301 | విజయవాడ, శనివారం 3 జూన్ 2023 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 3 June 2023 | Rs

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్ పరీక్షలు

- 10 ప్రాంతాల్లో 11 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ఎగ్జామ్ సెంటర్లలో సిసి కెమెరాల ఏర్పాటు

లోపలి పేజీలో..



హర్మన్‌ప్రీత్ జోరు

- బెల్జియంపై 5-1 గోల్స్‌తో గెలుపు

లోపలి పేజీలో..

పెను విషాదం

బాలాసోర్ వద్ద గూడ్స్‌ను ఢీకొన్న కోరమాండల్ • పక్కకు ఒరిగిన బోగీలను ఢీకొన్న యశ్వంత్‌పూర్

• మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం • 350 మందికి పైగా గాయాలు

70 మంది మృతి

- ఒకేచోట ఒకదానినొకటి ఢీకొన్న రెండు రైళ్లు
- పలు రైళ్ల రద్దు మరికొన్ని దారిమళ్లింపు
- సిగ్నలింగ్ వైఫల్యమే కొంపముంచింది
- రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల దిగ్భ్రాంతి



సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది, స్థానికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రైల్వే భద్రతకు నిధుల కోత..రైల్వేల ప్రయివేటీకరణ చర్యలు ఇప్పుడు ఏకంగా ప్రయాణికుల ప్రాణాలను తోడేస్తున్నాయి. ఒడిశాలోని బాలాసోర్ జిల్లా సమీపంలోని బహనగ స్టేషన్ వద్ద సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యంతో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల పట్టాలు తప్పాయి. తొలుత బహనగ స్టేషన్‌లో ఆగివున్న గూడ్సు బండిని కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పట్టాలు తప్పి పల్టీలు కొట్టింది. 13 బోగీలు ప్రక్కనే ఉన్న ట్రాక్‌పైకి ఒరిగిపోయాయి. అదే సమయంలో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చి కోరమండల్ బోగీలను ఢీకొనింది. దీంతో పలు బోగీలు పల్టీ కొట్టాయి. శుక్రవారం రాత్రి 7.08 గంటల ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘోర జంట ప్రమాదాల్లో 70 మంది పైగా బతుకులు బుగ్గిలో కలిసిపోయాయి. మరో 350 మంది పైగా ప్రయాణికులు గాయాలతో నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రమాదస్థలిలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. కారు చీకట్లలో ప్రయాణికుల హాహాకారాలు మిన్నంటాయి. మృతదేహాలను ఒక్కటొక్కటిగా బయటకు తీశారు. రక్తమోడుతున్న క్షతగాత్రులను అంబులెన్సులలో వివిధ ఆసుపత్రులకు తరలించారు. ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్ సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ప్రమాదంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ మిగతా 5లో



ట్రాక్టరు నడుపుతున్న సిఎం జగన్

ఆర్‌బికెలను పటిష్టపరుస్తాం

- త్వరలో వైఎస్ఆర్ యంత్ర సేవా యాప్
- పరికరాల కోసం 15 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవచ్చు
- గుంటూరులో ట్రాక్టర్లు, హార్వెస్టర్లను పంపిణీ చేసిన సిఎం జగన్
- రూ.125.48 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము విడుదల

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ద్వారా రైతులకు అందిస్తోన్న సేవలను గణనీయంగా పెంచుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ యంత్రసేవా పథకం కింద రైతులకు ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను శుక్రవారం గుంటూరులో పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీలో భాగంగా రూ.361.29 కోట్ల విలువైన 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను స్థానిక చుట్టుగుంట సర్కిల్‌లో పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు రూ.125.48 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్‌బికె వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. ప్రతి ఆర్‌బికె పరిధిలో వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు. ప్రతి ఆర్‌బికె పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను తీసుకునేందుకు ఒక యాప్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ యాప్‌లో ఎవరైతే మెసెజ్ పెడతారో వారికి సంబంధిత యంత్ర పరికరాలు రైతులందరు వాడుకునేందుకు, పేద రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు అతి తక్కువ అద్దెతో వినియోగించుకునేందుకు వైఎస్ఆర్ యంత్రసేవా యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ యాప్ సహాయంతో 15 రోజుల ముందుగానే వ్యవసాయ ఉపకరణాలను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో 10,444 ఆర్‌బికెల పరిధిలో రూ.1052 కోట్ల ఖర్చుతో యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. ప్రతి ఆర్‌బికెకు రూ.15 లక్షలు కేటాయించి, అక్కడ ఎటువంటి యంత్రాలు కావాలని రైతులనే నిర్ణయించుకోమని చెప్పి, వాళ్ల నిర్ణయం ప్రకారం ఆ యంత్ర సేవలన్నీ వారి అవసరాల మేరకు తీసుకుని వస్తున్నామని తెలిపారు. 491 క్లస్టర్ల స్థాయిలో వరి బాగా పండుతున్న చోట కంబైన్డ్ హార్వెస్టర్లు తీసుకుని రావాల్సిన అవసరం మిగతా 7లో

మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సిఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వి శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో దాదాపు 40 వేలమంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఎక్కడా అమలుకావడం లేదని తెలిపారు. గతంలో అనేక తీర్పుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు టైమ్‌స్కేల్ అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా అమలు కావడం లేదన్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను నియమించకూడదని చట్టం చెబుతున్నప్పటికీ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, నగర పంచాయతీలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేయడం సరైందికాదని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు నాలుగేళ్లయినా అమలుకాని పరిస్థితి వుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేస్తామని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఉద్యోగులకు ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి శాశ్వత స్వభావంలో పనిచేసే కార్మికులందరినీ పర్మినెంటు చేయాలని కోరారు. ప్రస్తుతం మున్సిపాలిటీలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 010 పద్దు కింద మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, ఇంజినీరింగు కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఓఎంఎస్ నెంబరు 7 మేరకు నెలకు రూ.18,500 చెల్లించాలన్నారు. ఉద్యోగులకు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు యాత్రలు చేస్తున్నారని, సంబంధిత ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



చంద్రకళ (ఫైల్)



వెంకట మణికంఠ (ఫైల్)

11మందికి అవయవ దానం

- విమ్స్, కిమ్స్ ఆసుపత్రుల రికార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం), యలమంచిలి రూరల్ (అనకాపల్లి జిల్లా)

కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రమూ తగ్గకుండా ఎన్నో అత్యాధునిక శస్త్ర చికిత్సలు చేసి మైలురాళ్లకు కేంద్రమైన విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) మరో మైలురాయిని చేరుకుంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలు సేకరించి రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ ఆస్పత్రిగా రికార్డు నమోదు చేసింది. సాధారణంగా బ్రెయిన్ డెడ్ కేసులకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే అవయవాలు సేకరిస్తుంటారు. మొదటిసారి విమ్స్‌లో శుక్రవారం మిగతా 2లో

ఇదీ రెజ్లింగ్ కీచకుడి బాగోతం

- ఒంటరిగా కనిపిస్తే చాలు.. లొంగదీసుకునే యత్నం
- లైంగిక వాంఛ తీర్చాలని వేధింపులు
- అనుచితంగా ముట్టుకున్నారు, ఛాతీపై చేతులు వేశారు
- నిందితుడిపై ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు



బ్రిజ్ భూషణ్, ఆందోళన చేస్తున్న రెజ్లర్లు (ఫైల్)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


తన లైంగిక వాంఛ తీర్చాలని మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ డిమాండ్ చేశారని ఆరోపణలు నమోదయ్యాయి. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్ (ప్రాథమిక సమాచార నివేదిక)లను, 10 ఫిర్యాదులను నమోదు చేశారు. రెజ్లర్లతో అసభ్య పదజాలాన్ని ఉపయోగించి సంభాషించడం వంటివి చేసేవారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన లైంగిక వాంఛ తీర్చాలని ఆయన మహిళా రెజ్లర్లను డిమాండ్ చేశారని ఆరోపణలు నమోదు చేశారు. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో వీటిని నమోదు చేశారు.

బ్రిజ్ భూషణ్ మహిళా రెజ్లర్లను అనుచితంగా ముట్టుకున్నారని, వారి ఛాతీపై చేతులు వేశారని, ఛాతీ నుంచి వీపువైపు తన చేతితో తడిమారని, వారిని వెంటాడారని ఈ ఫిర్యాదుల్లో ఆరోపించారు. ఈ ఫిర్యాదులు ఏప్రిల్ 21న నమోదయ్యాయని, రెండు ఎఫ్ఐఆర్‌లు ఏప్రిల్ 28న నమోదయ్యాయని పోలీసులు చెప్పారు. ఈ ఆరోపణలు రుజువైతే దోషికి సుమారు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.

ఆరుగురు ఒలింపియన్లు సిన ఆరోపణల ఆధారంగా మొదటి ఎఫ్ఐఆర్‌ను, ఓ మైనర్ తండ్రి ఫిర్యాదు మేరకు మరొక ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. తనను బ్రిజ్ భూషణ్ అనుచితంగా ముట్టుకున్నారని, తన భుజాలను గట్టిగా నొక్కారని ఈ మైనర్ ఆరోపించింది. ఫొటో తీసుకోవాలనే సాకుతో ఆయన తనను గట్టిగా పట్టుకున్నారని తెలిపింది. తనను ఫాలో మిగతా 7లో

విభజన హామీల తాకట్టు

- కేసుల మాఫీ కోసమే
- మా మేనిఫెస్టో బాగుందని ఒప్పుకున్న జగన్
- మీడియా గోష్టిలో చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటి వరకు విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు కాలేదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో అనేక హామీలను కేంద్ర ప్రభుత్వం చట్టంలో పొందుపరిచిందని తెలిపారు. ఈ చట్టం కాలపరిమితి మరో ఏడాదితో ముగుస్తుందని గుర్తుచేశారు. చట్టంలోని హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని చంద్రబాబు అన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించకుండా సిఎం జగన్ రాష్ట్రానికి అన్యాయం చేశారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ మెట్రోరైల్, వైజాగ్-చెన్నై కారిడార్ గురించి కనీసం మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న వ్యక్తి కేసుల మాఫీ కోసం తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. కేసులపై కేంద్రంతో లాలూచీ పడ్డారని, రాజ్యసభ సీట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. శివరామకృష్ణన్ కమిటీ సూచన మేరకు రాజధానిగా ప్రకటించిన అమరావతికి అసెంబ్లీ సాక్షిగా వైసిపి అంగీకరించిందన్నారు. ఇప్పుడు మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతుందని విమర్శించారు. తొమిదేళ్లు గడిచినా రాష్ట్రానికి రాజధాని ఏదో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు రాష్ట్రాల ప్రజలు ఆనందంగా ఉండేలా సమన్యాయం చేయాలని టిడిపి పోరాడిందని తెలిపారు. విభజన తరువాత రూ.16 వేలకోట్ల లోటు బడ్జెట్, రూ.1.10 లక్షల కోట్ల అప్పు, 22.5 మిలియన్ యూనిట్ల (ఎంయు) విద్యుత్ కొరతతో పాలన ప్రారంభించానని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే 2020 జూన్ నాటికే పోలవరం పూర్తయ్యేదని, ఇప్పుడు పూర్తికావడానికి ఎన్నాళ్లు పడుతుందో తెలియని దుస్థితి ఉందని, దీనికి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సిగ్గులేకుండా ప్రాజెక్టు మొదటి దశను 2025 నాటికి పూర్తిచేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ప్రతి ఏటా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని తాను జరిపానని, ఇప్పుడు కనీసం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు కూడా చెప్పలేని దుస్థితిలో సిఎం జగన్ ఉన్నారని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి ప్లస్ తాను ప్రకటించిన మేనిఫెస్టోను బిసి బెల్‌బాత్, పులిహోరతో పోల్చారని, వీటిలో ఒకటి రుచిగా ఉంటుందని, మరొకటి పౌష్టికాహారం ఇస్తుందని తెలిపారు. దీని అర్థం మేనిఫెస్టో బాగుందని జగనే ఒప్పుకున్నారని చెప్పారు.

కేదార్‌నాథ్‌లో బాపట్ల వాసి మృతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

కేదర్‌నాథ్‌లో బాపట్లకు చెందిన మహిళ మృతి చెందారు. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం... బాపట్ల మండలం హైదరపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబుల్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువులు 50 మంది బద్రీనాథ్, కేదార్నాథ్ యాత్రలకు వెళ్లారు. వారిలో బాబుల్‌రెడ్డి మేనల్లుడు పోతు రాజురెడ్డి తల్లి పెరుమాళ్ల లక్ష్మి (50) కేదార్‌నాథ్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా శ్వాస అందక గత నెల 31న మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని బంధువులు కేదార్‌నాథ్ నుంచి బాపట్ల తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహానికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించామని మృతురాలి కుటుంబసభ్యులు తెలిపారు.



లక్ష్మి (ఫైల్ ఫొటో)

పశ్చిమ గాలులతో రాష్ట్రం నిప్పుల కొలిమి!

- రాగల రెండు మూడు రోజులూ 4 డిగ్రీలు పెరిగే అవకాశం
- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ, అమరావతి బ్యూరోలు

రాష్ట్రంలో శుక్రవారం పగలంతా నిప్పుల కొలిమిని తలపించింది. వడగాల్పులతో ప్రజలు విలవిలలాడారు. ఉదయం నుండే ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో జనం ఎక్కడికక్కడ ఇళ్లకే పరిమితమయ్యాయి. తప్పనిసరైతే తప్ప బయటకు రాలేదు. బయటకు వచ్చిన వారు వడగాల్పుల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పల్నాడు జిల్లా ఈపూరు మండలంలో, బొందపల్లి మండలంలో 44.9 డిగ్రీలు, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో 44.8 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 286 మండలాల్లో వడగాల్పులు వీచాయి. పడమర గాలుల ప్రభావం కూడా దీనికి కారణం. శుక్రవారం మధ్యాహ్నం విశాఖ నగర వీధులన్నీ జన సంచారం లేక ఖాళీగా కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్, జగదాంబ జంక్షన్ వంటి ప్రాంతాల్లోనూ జనం రద్దీ కానరాలేదు. విశాఖలో 43 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకోవడంతో ఎండ తాకిడికి జనం విలవిలలాడారు. వేసవి కాలంలో నిత్యం ఫిషింగ్ హార్బర్ జెట్టీ నెంబర్ 11లో స్నానాలకు దిగే యువత కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. విజయవాడలోనూ జనసంచారం తగ్గింది. తిరుపతి, విజయవాడ, అమరావతి, నంద్యాల, మిగతా 7లో



విశాఖలో తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా బయటకు...

14 నుంచి వారాహి యాత్ర

- కత్తిపూడి కూడలిలో పవన్ తొలి సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం, ప్రజా సమస్యలపై బలమైన పోరాటం చేసేందుకు 'వారాహి' యాత్రను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 14న ప్రారంభిస్తారని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత అన్నవరం సత్యదేవుని దర్శనం అనంతరం వారాహి యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. అన్నవరం నుంచి భీమవరం వరకు 11 నియోజకవర్గాల్లో తొలివిడత యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ రెండు రోజులపాటు ఉండేలా, సభలో ప్రసంగించేలా ప్రణాళిక తయారుచేశామన్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పత్తిపాడు నియోజకవర్గంతో మొదలు పెట్టి పిఠాపురం, కాకినాడ, కాకినాడ రూరల్, ముమ్మిడివరం, అమలాపురం, పి గన్నవరం, రాజోలులో పర్యటన ఉంటుందన్నారు. అనంతరం నరసాపురం, పాలకొల్లు, భీమవరం, నియోజకవర్గాల్లో యాత్ర ఉంటుందని, ఇతర నియోజకవర్గాల్లో రూట్‌మ్యాప్‌ను స్థానిక నేతలతో చర్చించి ఖరారు చేస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకు ప్రజా వినతులు స్వీకరించి, స్థానికులు, రైతులు, మహిళలు, వివిధ వర్గాలతో పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా మాట్లాడతారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రవాణా రంగాన్ని ఆదుకునేలా మేనిఫెస్టో

- చంద్రబాబుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని ఆదుకునేలా టిడిపి మేనిఫెస్టోలో నిర్ణయాలు ప్రకటించాలని టిడిపి అధినేత చంద్రబాబును ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రవాణా రంగం సంక్షోభంలో పడిందని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. డీజిల్, పెట్రోల్‌పై రోడ్డు సెస్ కింద రూపాయి వసూలు చేస్తున్నారని, రోడ్లు మరమ్మతులు లేవని తెలిపారు. ఓవర్ హైట్ కేసుల పెనాల్టీ గతంలో ఉన్న రూ.వెయ్యిని రూ.20 వేలు చేశారని వివరించారు. కరోనా సమయంలో అన్ని రాష్ట్రాలూ లారీ యజమానులకు క్వార్టర్ ట్యాక్స్ మినహాయింపు ఇచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నారు. రూ.200 గ్రీన్ ట్యాక్స్‌ను రూ.20 వేలకు పెంచారని తెలిపారు. క్వార్టర్లీ ట్యాక్స్‌ను కూడా 25 నుంచి 30 శాతానికి పెంచారని వివరించారు. రవాణా రంగాన్ని ఆదుకునేలా అవసరమైన నిర్ణయాలు మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే
ప్రభుత్వంపై దండయాత్ర

- మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలి
- కొనసాగుతున్న జీపు జాతాలు



కర్నూలులో మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి-యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై దండయాత్రకు సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు కార్మికులకు పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలు శుక్రవారం మూడోరోజుకు చేరాయి. అనంతపురం జిల్లా హిందూపురం నుంచి ప్రారంభమైన జాతా కర్నూలు మీదుగా నంద్యాల జిల్లా బేతంచెర్లలోకి, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన జాతా విశాఖ, అనకాపల్లి మీదుగా కాకినాడ జిల్లా పెద్దాపురంలోకి ప్రవేశించించాయి. జాతాలకు ఆయా మున్సిపాల్టీల్లో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు స్వాగతం పలికారు.

విశాఖ, అనకాపల్లిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తాననిఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఆరు మాసాలలోనే ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి మోసం చేశారని తెలిపారు. లక్ష రూపాయల జీతం ఇచ్చినా.. ఎవరూ చేయలేని పనిని పారిశుధ్య కార్మికులు చేస్తున్నారని అసెంబ్లీలో చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఆ కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. సుప్రీం ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి 010 పద్దు ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 తర్వాత రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జాతాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు పాల్గొని మాట్లాడారు.

కర్నూలులో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చి నాలుగేళ్లవుతున్నా అమలు కాలేదని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆయాచోట్ల జాతాకు మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు.

బదిలీల గడువు పొడిగించాలి

- ఎమ్‌డి లక్ష్మీశాకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల గడువు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. రెండో నోటిఫికేషన్ ద్వారా నియమితులై, అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అధికారులు సకాలంలో ప్రొబేషన్ డిక్లేర్ చేయకపోవడంతో ఆరు వేలమంది బదిలీల అవకాశం కోల్పోతున్నారని అన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టరు లక్ష్మీశాను ఉద్యోగ సంఘం ప్రతినిధి బృబృందం సభ్యులు కలిసి వినతిపత్రం సమర్పించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న వికలాంగులకు ఈ బదిలీల్లో కచ్చితంగా ప్రాధాన్యత కల్పించేలా చూడాలని, ఎఎన్‌ఎం, హెల్త్ కార్యదర్శులకు ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్‌లో స్వాప్, ఇతర ఆప్షన్స్ కూడా ఇవ్వాలని, ఈ విషయంపై మెడికల్ అండ్ హెల్త్ కమిషనరు వద్ద అనుమతి తీసుకోవాలని ఎమ్‌డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్‌డిని కలిసిన ప్రతినిధి బృందంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థ మధు, గుంటూరు జిల్లా అధ్యక్షులు వెంకటసాయి మణికంఠ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు నవీన్, నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్నేహలత, నాయకులు రాజారామ్ ఉన్నారు.

ప్రజల ముంగిటకే వినోదం

'ఫస్ట్ డే ఫస్ట్ షో' కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోనే వినూత్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఎపి స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ద్వారా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం 'ఫస్ట్ డే ఫస్ట్ షో' సినిమా చూసే విధంగా ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. విశాఖలోని పార్క్ హోటల్‌లో 'ఫస్ట్ డే ఫస్ట్ షో' కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.99తో రీఛార్జ్ చేసుకుంటే 24 గంటలూ సినిమా ఉంటుందని, సినిమా ఇండస్ట్రీకి ప్రయోజనకరంగా ఉండేలా టెక్నికల్ బృందం దీన్ని రూపొందించిందని వివరించారు. పైరసీకి అవకాశం లేకుండా ప్రభుత్వం రాష్ట్రంలోని 8 వేల పంచాయతీలకు ఫైబర్ నెట్‌ను తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రంలో 55 వేల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ నెట్‌ను గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలైన పాడేరు, రంపచోడవరం వంటి చోట్లకు కూడా విస్తరించామని తెలిపారు. వినోదాన్ని ప్రజల ముగింటకు తక్కువ ఖర్చుతో తీసుకెళ్లడమే ప్రభుత్వ విధాన మన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇది విప్లవాత్మకమైన మార్పు అని చెప్పారు. కార్యక్రమంలో ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా విడుదలైన రోజే ఇంట్లో కూర్చొని కొత్త సినిమా చూడొచ్చని, దీంట్లో అపోహలకు తావులేదని అన్నారు. సినీ నిర్మాత సి.కల్యాణ్, ఎపి ఫైబర్ నెట్ అధికారులు, సాంకేతిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిర్దోషైతే సర్వీసులోకి తీసుకోవాల్సిందే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

శాఖాపరమైన విచారణ తర్వాత వివిధ ఆరోపణలతో సర్వీస్ నుంచి ఉద్యోగిని తొలగించిన కేసును కోర్టు కొట్టేసినప్పుడు ఆ ఉద్యోగిని తిరిగి సర్వీసులోకి తీసుకోవాల్సిందేనని హైకో ర్టు తీర్పుచెప్పింది. ఉద్యోగిపై కేసును కొట్టేసి నిర్దోషిగా కోర్టు తేల్చిన తర్వాత ఆయనపై శాఖాపరమైన దర్యాప్తు చెల్లుబాటుకాదని, సర్వీస్ నుంచి తొలగింపు చెల్లదని స్పష్టం చేసింది. పనిచేయని కాలానికి జీతభత్యాలు చెల్లించాల్సిన అవసరం లేదని (నోవర్క్ నోపే) జస్టిస్ చీకటి మానవేంద్ర నాథ్ రాయ్, జస్టిస్ వి గోపాలకృష్ణారావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. కర్నూలు జిల్లా నంది కొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో టైపిస్ట్ ఖాసిం సాహెబ్‌ను ప్రభుత్వ సర్వీస్ నుంచి తొలగింపు ఉత్తర్వులను రద్దు చేసింది. తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని తీర్పు చెప్పింది.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినసదిస్తున్న దోసపాడు దళితులు, నేతలు

భూమి మాదే.. పంటా మాదే..

దోసపాడు దళితులు, పేదలు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

'భూమి మాదే.. పంట మాదే.. హక్కులు మాకే దక్కాలి' అని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఏలూరు కలెక్టరేట్ ఎదుట దెందులూరు మండలం దోసపాడు దళితులు, పేదలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు పేదలు, దళితులు గత సంవత్సరం నుండి వారి భూముల కోసం పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. పేదల హక్కులను కాలరాస్తూ, దళితుల చట్టాలను నీరుగారుస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోసపాడు దళితుల సమస్యను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందన్నారు. 1965, 74లో దఫదఫాలుగా ప్రభుత్వాలు పేదలకు పట్టాలు, పాసుపుస్తకాలు మంజూరు చేశాయని తెలిపారు. ఆ రికార్డులు జిల్లా రెవెన్యూ శాఖాధికారుల అధీనంలో ఉన్నాయన్నారు. దోసపాడులో రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని, రికార్డులను తారుమారు చేసిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దళితులు, పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్ భూములను తక్షణమే వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా భూములను స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నారో వారిని అరెస్టు చేసి శిక్షించాలని, లేనిపక్షంలో ఈ నెల 10వ తేదీ నుండి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్.జాన్‌రాజు, నాగేంద్ర, పవన్, మణి, బేబీ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్ట పనివేళలు అమలు చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 6:30 గంటలు పని కాగా, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు 13 నుంచి 14 గంటలు పని చెప్పడమేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సచివాలయం ఉద్యోగులపై చిన్నచూపు ఎందుకని, జిఓఎంఎస్ నెంబరు 650ను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడున్నరేళ్లుగా నగరపాలక సంస్థల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీరిని సచివాలయాలకు దూరంగా ఉంచి డెత్ టెక్నికల్ సర్వీస్‌లు వీరికి ఇవ్వకుండా విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. అన్యాయంగా సస్పెన్షన్లు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్విరామంగా పారిశుధ్య, బర్త్ పర్యవేక్షణ, చెత్త రుసుము వసూలుకు మాత్రమే పరిమితం చేశారని పేర్కొన్నారు.

మహిళా కార్యదర్శులను తెల్లవారుజామునే 5 గంటలకు మస్టరుకు రమ్మని ఒత్తిడి చేస్తున్నారని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా.. చెత్త రుసుమును ప్రజలను మెప్పించి వసూలు చేస్తున్న కార్యదర్శులకు మద్దతుగా నిలవాల్సిన అధికారులు జీతాలు కట్ చేస్తామని, సస్పెండ్ చేసి సర్వీసు రికార్డులో నమోదు చేస్తామనంటూ బెదిరిస్తున్నారన్నారు. చెత్త రుసుము వసూలు రోజువారి టార్గెట్లు పెట్టి వేధించడం, విధులు ముగిసిన తర్వాత కుటుంబంతో గడిపే సమయంలో టెలికాన్ఫరెన్స్‌లు పెట్టి వేధించడం బాధాకరమని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 1 నుంచి వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులను మిగతా సచివాలయం సెక్రటరీల మాదిరిగానే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయం నుంచి సేవలు అందించేందుకు నిర్ణయించుకున్న వారికి పిడిఎఫ్ మద్దతు తెలుపుతోందన్నారు.

11మందికి అవయవ దానం

మొదటిపేజీ తరువాయి : బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి అవయవాలు సేకరించి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పి చంద్రకళ (32) గత నెల 31న తీవ్ర తల నొప్పితో అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వైద్యం నిమిత్తం ఆమెను విమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. న్యూరో సర్జరీ వైద్యుల ఆధ్వర్యంలో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్టు గుర్తించారు. నివారణకు వైద్య బృందం తీవ్రంగా శ్రమించినప్పటికీ నియంత్రణలోకి రాకపోగా శరీరంలో ఒక్కొక్క అవయవం పనిచేయడం మానేశాయి. దీంతో వైద్యులు గురువారం చంద్రకళను బ్రెయిన్ డెడ్‌గా ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె రాంబాబు మహిళ కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించారు. కుటుంబ సభ్యుల పూర్తి అనుమతితో ఆమె నుంచి రెండు కిడ్నీలు, రెండు కళ్లను సేకరించారు. రెండు కిడ్నీలను విశాఖ నగరంలోని అపోలో, కేర్ ఆస్పత్రులకు, రెండు కళ్లను ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి కేటాయించారు. జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఆ అవయవాలను అవసరమైన రోగులకు అందించారు. శుక్రవారం వేకువజాము నాలుగు నుంచి ఆరు మధ్య ఈ ప్రక్రియను సజావుగా పూర్తిచేశారు.

ఘన వీడ్కోలు : చంద్రకళ మృతదేహానికి విమ్స్ ఆసుపత్రి సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఆమె భౌతికకాయం వద్ద సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ రాంబాబు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానం చేసినందుకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2900 మంది రోగులు అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

ఏడుగురికి బతుకునిచ్చిన కొత్తపాలెం యువకుడు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేసి ఏడుగురికి బతుకునిచ్చిన ఘటన అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపాలిటీ కొత్తపాలెంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపాలెం గ్రామానికి చెందిన మళ్ల వెంకట మణికంఠ (22) రెండో రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు గాయమై రక్తస్రావం కావడంతో వైద్య సేవల కోసం విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు పొందుతూ బ్రెయిన్ డెడ్ కావడంతో తమ కుమారుడు చనిపోతూ మరికొందరికి బతుకునివ్వాలని తలంచి మణికంఠ తల్లిదండ్రులు అవయవదానం చేసేందుకు అంగీకరించారు. జీవనధార ఫౌండేషన్‌కు అవయవాలను డొనేట్ చేశారు. ఈ మేరకు ఆ అవయవాలను ఏడుగురికి జీవితాల్లో వెలుగునింపింది. గుండెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి, మూడు అవయవాలను విశాఖ నగరంలోని మూడు ఆస్పత్రులకు తరలించారు. మిగతా మూడు అవయవాలను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోనే భద్రపరిచారు. మణికంఠ యలమంచిలిలోని పూర్ణ సాయి వివేకానంద కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మణికంఠ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అభినందించారు. దిమిలి రోడ్డు నుంచి కొత్తపాలెం గ్రామం వరకు జరిగిన మణికంఠ అంతిమయాత్రలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌టిటిపిఎస్‌లో ట్రయల్ రన్

- ప్రారంభించిన జెన్‌కో ఛైర్మన్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్)లో 8వ యూనిట్‌కు ట్రయల్ రన్ నిర్వహించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జెన్‌కో ఛైర్మన్ కె విజయానంద్, ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు కంప్యూటర్ బటన్ ద్వారా ట్రయల్ రన్ చేపట్టారు. ఇబ్రహీంపట్నంలోని పవర్ స్టేషన్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆగస్టు నాటికి సిఒడికి వీలుగా మిగిలిన పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను విజయానంద్ ఆదేశించారు. ఇందుకు జెన్‌కో పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం రోజువారీ విద్యుత్ డిమాండ్‌లో సుమారు 105 మిలియన్ యూనిట్ల (ఎంయు) విద్యుత్‌ను జెన్‌కో అందిస్తుందని తెలిపారు. ఈ యూనిట్ ద్వారా రోజూ సగటున మరో 15 నుంచి 20 ఎంయుల విద్యుత్‌ను జెన్‌కో అదనంగా సరఫరా చేయనుందని చెప్పారు. ఏడాది కాలంలో 1600 మెగావాట్ల అదనపు సామర్థ్యం గల రెండు యూనిట్లు అందుబాటులోకి రావడం జెన్‌కో చరిత్రలో నిలుస్తోందన్నారు. ఎమ్‌డి చక్రధరబాబు మాట్లాడుతూ.. ట్రయల్ రన్‌లో బయటపడే లోటుపాట్లను సరిదిద్దుకుని మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఆగస్టు నాటికి స్టేజ్-5 ప్లాంటు వాణిజ్య ఉత్పత్తి (సిఒడి) చేసేందుకు వీలుగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో డైరెక్టర్లు చంద్రశేఖర్ రాజు (థర్మల్), బి వెంకటేశులురెడ్డి (ఆర్థిక), సయ్యద్ రఫీ (హెచ్‌ఆర్ అండ్ ఐఆర్), సత్యనారాయణ (హైడల్), అంథోనీ రాజ్ (కోల్) తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 ప్రధాన పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిద్ధం చేసింది. మొత్తం 111 పోస్టుల భర్తీకి ఈ నెల 10 వరకు ఉదయం 10 నుంచి 1 గంట వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6,455 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అర్హత సాధించారు. 10 ప్రాంతాల్లో 11 పరీక్ష కేంద్రాలను కమిషన్ ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలులో పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8:30 నుంచి 9:30లోపు చేరుకోవాలి. 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఉంటుంది. 9:45 నిమిషాల లోపు పరీక్ష కేంద్రం వద్ద ఉన్నవారికి మాత్రమే అనుమతి. ఆ తరువాత అనుమతి లేదు. అభ్యర్థులు బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, ఫేస్ రికగ్నేజేషన్‌ను పరీక్ష కేంద్రాల్లో తీసు కుంటారు. ఎపిపిఎస్‌సి ఛైర్మన్ డి గౌతమ్ సవాంగ్ విజయవాడలోని పొట్టి శ్రీరాములు చదలవాడ మల్లిఖార్జున రావు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు.

14న ఆయుష్ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆయుష్ శాఖలోని పలు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 14న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ వెల్లడించారు. యునానిలోని మెడికల్ ఆఫీసర్ పోస్టులకు, ఆయుర్వేద, హోమియోపతిలోని లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఎపిపిఎస్‌సి కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సిఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సిపిఎస్ రద్దు చేయండి

- పలు అంశాలపై సిఎంకు కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సిఎం జగన్మోహన్‌రెడ్డిని కోరారు. ముఖ్యమంత్రి గుంటూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లో జగన్మోహన్‌రెడ్డిని ఆయన శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. సిపిఎస్ రద్దు చేసి మూడు లక్షల ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి కొత్త డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గుంటూరు ఛానల్ విస్తరణకు రూ.113 కోట్లు కేటాయించాలని, గురుకులాల్లో, యూనివర్సిటీలలో నాన్-టీచింగ్ స్టాఫ్‌కు పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బిజెపి విధానాలు

చీరాల : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పురాణాల ఆధారంగా చరిత్రను వక్రీకరించి భారతదేశ లౌకిక స్ఫూర్తిని, ప్రజల ఐక్యతను దెబ్బతీస్తోందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో చీరాల విద్యాకాలేజీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుండే భారత సమాజాన్ని మతం ఆధారంగా విడగొట్టేందుకు, పాఠ్యాంశాలనూ మార్చేసేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. రోమిల్లా థాపర్ వంటి చరిత్ర పరిశోధకులు శాస్త్రీయంగా రూపొందించిన పాఠ్యాంశాలను వక్రీకరిస్తోందని అన్నారు. ముస్లిములకు, క్రైస్తవులకు, బౌద్ధులకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మానవజాతి అభివృద్ధిలో శాస్త్రీయ బద్ధమైన డార్విన్ పరిణామ సిద్ధాంతం ప్రపంచ దేశాలన్నీ ఆమోదించిన పాఠ్యాంశాలను పుస్తకాలు నుండి తొలగించడం సైన్స్ పరిశోధనలపై మతోన్మాద భావజాలం దాడి చేయడమేనన్నారు. సదస్సుకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు అధ్యక్షత వహించారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్ధయ్య, యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి బిక్షాలుబాబు, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబూరావు, ఎం వసంతరావు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిపై కదలిక : సిఎంఒ ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి : ఉద్యోగుల అంశాల్లో కీలకమైన 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించిన దస్త్రాలను సిద్ధం చేయాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం సర్క్యులర్ జారీ చేసింది. వేతన సవరణ సంఘం ఏర్పాటు ద్వారా ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ఖరారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల సంఘం ఇటీవల ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించింది. ఈ నెలాఖరుతో 11వ వేతన సవరణ సంఘం కాలపరిమితి పూర్తవుతుందని, అందువల్ల వెంటనే 12వ పిఆర్‌సిని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు కోరారు. జులై 1 నుంచి కొత్త వేతన స్కేల్ అమలు చేయాల్సి ఉంటుందని కూడా తమ లేఖలో కోరారు. ఇతర అంశాలను కూడా పరిష్కరించేందుకు 12వ పిఆర్‌సి ఏర్పాటుచేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే సంబంధిత ఫైలును సర్క్యులేట్ చేయాలని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ధనంజయరెడ్డి సర్క్యులర్ పంపించారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)
అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలుకుల గ్రామానికి చెందిన ఒంటేరు రత్తయ్య (49)కు రెండు ఎకరాల సొంత భూమి ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి, కంది తదితర పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగు నిమిత్తం సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. గతమూడేళ్లుగా వాతావరణం అనుకూలించక పంటలు పండకపోవడంతో అప్పులు తీర్చడం కష్టమైంది. రుణదాతలు అప్పులు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అప్పులు చెల్లించే మార్గం లేక ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రత్తయ్య భార్య గంగాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'హృదయాలయ'లో అద్భుతమైన వైద్యసేవలు

- నిర్మాణాలను పరిశీలించిన డాక్టర్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల
తిరుమలలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు అద్భుతంగా ఉన్నాయని వైద్యులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అభినందించారు. ఆస్పత్రి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనులు చాలా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఆస్పత్రిలో ఆరు రకాలైన సూపర్ స్పెషాలిటీ సేవలను అందించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఇందుకు అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని నియమించుకుని అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. హృదయాలయంలో జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. పిల్లల గుండె ఆపరేషన్ కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలోని రోగులకు డాక్టర్లు, సిబ్బంది నిబద్ధతతో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని జవహర్ రెడ్డి అభినందించారు. ఆస్పత్రిలో సేవలు కార్పొరేట్ స్థాయి కంటే బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, ఆర్ఎంఒ డాక్టర్ భరత్ పాల్గొన్నారు. జవహర్ రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారిని సందర్శించారు.

ఇరిగేషన్‌లో అస్తవ్యస్తం

- కోర్టు కేసుల పేరుతో పడకేసిన ఇంజనీరింగ్
- 500 మంది ఇంజనీర్ల భవిత ప్రశ్నార్థకం
- రాయలసీమ అభివృద్ధి పనుల్లో స్తబ్దత
- సిఎం జిల్లాకూ తప్పని ఎఫ్‌ఎసి జాడ్యం


అసంపూర్తిగా ఉన్న కాలేటి వాగు నిర్మాణ పనులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి
రాష్ట్ర జలవనరుల శాఖలో అయోమయం నెలకొంది. రాష్ట్రంలో నాలుగు జోన్ల పరిధిలోని 500 మంది ఇంజనీర్ల భవిత కోర్టు కేసుల వల్ల ప్రశ్నార్థకంగా మారింది. ఇదే తరహా కోర్టు కేసులు కలిగిన పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖలు రెగ్యులర్ ఇంజనీరింగ్ నిపుణులతో పురోగతి బాటలో పయనిస్తున్నా, రాష్ట్ర జలవనరుల శాఖ పనుల్లో పురోగతి పడకేసింది.

జోన్ల వారీగా ఉద్యోగోన్నతుల విషయంలో అభ్యంతరాలపై ఉమ్మడి రాష్ట్రం సమయంలో కొందరు ఇంజనీర్లు కోర్టుకు వెళ్లారు. దీంతో, ఉద్యోగోన్నతులు నిల్చిపోయాయి. కొత్త నియామకాలూ జరగడం లేదు. ఉన్న వారిపైనే పని భారం పడుతోంది. అవసరమైనంతమంది ఇంజనీర్లు లేక పనుల్లో పురోగతి పడకేసింది. రాష్ట్ర జలవనరుల శాఖలో ముగ్గురు ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్‌లు (ఇఎన్‌సిలు), 12 మంది సిఇలు, 250 మంది ఇఇలు, 40 మంది ఎస్‌ఇలతో డిఇలు, ఎఇలతో కూడిన ఇంజనీరింగ్ పాలనా రథం నడుస్తోంది. వీరిలో 10 నుంచి 12 శాతం మంది ఇంజనీర్లు అదనపు బాధ్యత (ఎఫ్‌ఎసి)లు నిర్వహిస్తున్నారు. ఒక్కరే మూడు బాధ్యతలు చూస్తున్న వారూ ఉన్నారు. వీరిలో కొందరికి 58 ఏళ్ల ఉన్నాయి. వయస్సు రీత్యా ఏ ఒక్క బాధ్యతకూ న్యాయం చేయలేని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో కీలక ఇంజనీర్లుగా గుర్తింపు పొందిన ముగ్గురు ఇఎన్‌సిలు, సిఇసిడిఒ, 12 మంది సిఇలు, 25 మంది ఇఇలు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఎసిలు)గానే విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ మూడు జిల్లాల్లో చీఫ్ ఇంజనీర్లుగా బాధ్యతలు నిర్వహించడం తలకుమించిన భారంగా మారింది. పది రోజులకు ఒకసారి కూడా మూడు జిల్లాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా రాష్ట్రంలో ఏటా రూ.25 వేల కోట్లతో కూడిన అభివృద్ధి పనుల్లో స్తబ్దత నెలకొందనే విమర్శ పెద్ద ఎత్తున వినిపిస్తోంది. రాష్ట్రంలో 20 మంది సిఇ పోస్టులకుగానూ 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ఎనిమిది సిఇ పోస్టుల్లో ఆరుగురు వచ్చే జనవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. మిగిలిన సిఇలు, ఎస్‌ఇలు వచ్చే ఏడాది మార్చి, జూన్ నాటికి ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని ఒంగోలు, కృష్ణా జిల్లాల సిఇలు మినహా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లా మొదలుకుని మిగిలిన అన్ని జిల్లాల్లోనూ సిఇలందరూ ఎఫ్‌ఎసిలుగానే కొనసాగుతున్నారు. కడప జిల్లాలోని ఐదుగురు ఎస్‌ఇల్లో ఒకరు మినహా, ఇఇల్లో 85 శాతం మంది ఎఫ్‌ఎసిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరిలో సిఇ, ఎస్‌ఇలతో కూడిన కొంతమంది పది రోజులకు ఒకసారి కూడా జిల్లాకు రావడం గగనంగా మారింది. దీంతో, జిల్లాలో ఇంజనీరింగ్ పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కరువు పీడిత ప్రాంతంగా గుర్తింపు పొందిన రాయలసీమ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతికి ఇది ప్రతిబంధంగా మారారనే విమర్శ వినిపిస్తోంది. రాయలసీమలోని కడప జిల్లాలో గాలేరు-నగరి నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతలు మొదలుకుని యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పార్నపల్లి ఎత్తిపోతల పనుల వరకు సుమారు రూ.10 వేల కోట్లతో కూడిన పనుల్లో ఆశించిన పురోగతి కొరవడినట్లు ఇంజనీరింగ్ గణాంకాలే తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత ఉద్యోగుల జనరల్ బదిలీల నేపథ్యంలో ఎఫ్‌ఎసిలను తొలగించి రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులను నియమిస్తేనే రెండేళ్ల కిందట వరదల్లో తెగిన అన్నమయ్య, పింఛా వంటి సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో పురోగతి కనిపించే అవకాశం ఉంది. కోర్టు కేసు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని ఇంజనీర్లు కోరుతున్నారు.

ట్రిపుల్‌ఐటిలో ప్రవేశానికి 4 నుండి దరఖాస్తుల స్వీకరణ

- ఆర్‌జియుకెటి యూనివర్సిటీ ఛాన్సలర్ కెసి.రెడ్డి

ప్రజాశక్తి - నూజివీడు
రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటి) అడ్మిషన్ నోటిఫికేషన్ జూన్ 3న విడుదల చేయనున్నట్లు వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెసి.రెడ్డి తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని ఛాన్సలర్ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు జూన్ 4 నుంచి 26వ తేదీ వరకూ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్పెషల్ కేటగిరి కింద విభిన్నప్రతిభావంతులకు రిజర్వేషన్ మూడు నుంచి ఐదు శాతానికి పెంచామని చెప్పారు. తాత్కాలిక ఫలితాలు జులై 13న ప్రకటిస్తామని వివరించారు. సర్టిఫికెట్ల పరిశీలన జులై మూడో వారంలో చేపడతామని, ఆగస్టు ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మొత్తం నాలుగు క్యాంపస్‌ల్లో నాలుగు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు పది శాతం అదనపు సూపర్ న్యూమరరీ సీట్లు ఉన్నాయని చెప్పారు. 85 శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు, 15 శాతం ఓపెన్ మెరిట్ ఆంధ్రా, తెలంగాణ రెండింటికి రిజర్వు చేసినట్లు తెలిపారు.

ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ఐదు శాతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేని అభ్యర్థులు యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్యాంపస్‌లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పారు. అడ్మిషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత క్యాంపస్‌ల మధ్య అభ్యర్థుల అంతర్గత బదిలీ అనుమతించబడదని తెలిపారు. సమావేశంలో అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్‌వి.గోపాలరాజు, డాక్టర్ భానుకిరణ్, క్యాంపస్ ఎఒ ప్రదీప్, పిఆర్‌ఒ సురేష్ బాబు పాల్గొన్నారు.

నేడు సిబిఐ విచారణకు అవినాష్ రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్
మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు నేపథ్యంలో కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం సిబిఐ ముందు విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసులో అవినాష్‌రెడ్డి కీలక అనుమానితుడని సిబిఐ హైకోర్టుకు సమర్పించిన ఛార్జ్ షీటులో పేర్కొన్న సంగతి తెలిసిందే. సిబిఐ అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వాలని అవినాష్‌రెడ్డి తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. అవినాష్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను విన్న తెలంగాణ హైకోర్టు మే 28న షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్ నుంచి పులివెందులకు చేరుకున్న అవినాష్‌రెడ్డి మూడు రోజుల పాటు జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబిఐ విచారణకు హాజరు కావాలని ఉంది. దీంతో, ఆయన శుక్రవారం మధ్యాహ్నం పులివెందుల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. శనివారం హైదరాబాద్‌లోని సిబిఐ కార్యాలయంలో అవినాష్‌రెడ్డి విచారణకు హాజరు కానున్నారు. అవినాష్ రెడ్డిని పలానా రోజు విచారణకు హాజరు కావాలని అవినాష్‌రెడ్డికి సిబిఐ ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు విచారణకు హాజరు కానట్లు తెలుస్తోంది.

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 40 దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-కడప అర్బన్/పోరుమామిళ్ల
వైఎస్ఆర్ జిల్లాలో నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశామని, వేర్వేరు చోట్ల 40 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి అన్బురాజన్ వెల్లడించారు. తన కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మైదుకూరు లంకమల అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. కడపలో ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోరుమామిళ్ల మండలం రామేశ్వరం గ్రామంలోని రాచకొండు రామయ్య ఇంటిలో 33 ఎర్రచందనం దుంగలను కడప టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్మగ్లర్లను అరెస్టు చేయడంలో, దుంగలను స్వాధీనం పరుచుకోడంలో కీలక పాత్ర పోషించిన అదనపు ఎస్‌పి (అడ్మిన్) తుషార్ డూడి పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎం నాగభూషణ్, మైదుకూరు అర్బన్ సిఐ చలపతి, ఎస్ఐ ఘణ మద్దిలేటి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని ఎస్‌పి అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

విశాఖ భూ కుంభకోణాలపై సిట్ నివేదికలు బహిర్గతం

- గవర్నరుకు జివిఎల్ ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత 2014 నుంచి విశాఖపట్నంలో పెద్దఎత్తున జరిగిన భూ కుంభకోణాలపై టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వేసిన సిట్ దర్యాప్తు నివేదికలు బయటపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. రాజ్‌భవన్‌లో శుక్రవారం గవర్నరుతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం జివిఎల్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మారుస్తోందని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరానని తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమానికి రాష్ట్రంలో సైనిక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరగా పరిశీలిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని జివిఎల్ వెల్లడించారు.


ప్రొద్దుటూరులో వివిధ రంగాల నిపుణులతో మాట్లాడుతున్న నారా లోకేష్

జగన్‌ది ఫ్యాక్షన్ మనస్తత్వం

- ఎపి బీహార్‌తో పోటీపడుతోంది
- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్/చాపాడు
ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిది ఫ్యాక్షన్ మనస్తత్వమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారానికి 114వ రోజుకు చేరుకుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మైదుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నాగులాపల్లి క్రాస్, ఖాదర్‌పల్లి, చాపాడు, సీతారాంపురం క్రాస్, చియ్యపాడు క్రాస్, అల్లాడుపల్లె దేవలాలు, కేతవరం, పుల్లయ్య సత్రం, విశ్వనాథపురం విడిది కేంద్రం వరకూ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో లాయర్లు, డాక్టర్లు, వ్యాపారస్తులు, టీచర్లు, ఐటి నిపుణులు అందరూ బాధితులేనన్నారు. సొంత జిల్లా కడప, సొంత నియోజకవర్గం పులివెందులకు సిఎం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఉమ్మడి కడప జిల్లాలో పదికి పది సీట్లు ఇస్తే జగన్ చేసింది ఏం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎపి బీహార్‌తో పోటీ పడుతోందని విమర్శించారు. ప్రస్తుతానికి షాపులు, వ్యాపారాల మీద దాడి చేస్తున్నారని, మరోసారి ఓటేస్తే జగన్ అండ్ కో ఇంటికొచ్చి దోచుకుంటారని తీవ్ర విమర్శలు చేశారు. టిడిపి హయాంలో న్యాయ విభాగానికి నిధులు కేటాయించి కొత్త భవనాలు, లైబ్రరీలు కట్టించడానికి పనులు ప్రారంభించామని, ఈ ప్రభుత్వం ఆ పనులు నిలిపివేసిందని ఆఅన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అడ్వకేట్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెస్తామని హామీ ఇచ్చారు. జగన్ వేధింపుల వల్లే అన్ని కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోతున్నాయన్నారు. అమర్‌రాజా, ఫాక్స్ కాన్, రిలయన్స్ లాంటి సంస్థలు వేరే రాష్ట్రాలకు వెళ్లి పోయాయని గుర్తు చేశారు. పాదయాత్రలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష)-2023 ఫలితాలు విడుదలయ్యాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి తెలిపారు. ఫలితాలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాలు, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపుతామని పేర్కొన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నియమాల ప్రకారం ఎంపికైన విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో సేవింగ్స్ ఖాతా తీసుకోవాలని తెలిపారు. తండ్రి, లేదా తల్లిని జాయింట్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి వివరాలు, తండ్రి వివరాలు ఆధార్ కార్డులో ఉన్నట్లుగా బ్యాంకు పాస్‌బుక్‌లోనూ అక్షరం తేడా లేకుండా ఉండాలన్నారు.

జాతీయ ఈత పోటీలకు బాపట్ల విద్యార్థి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఈ నెల 5వ తేదీ నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఈత పోటీలకు బాపట్ల జూనియర్ కళాశాల విద్యార్థి ఉప్పాల జ్ఞాన వివేక్‌గౌడ్ ఎంపిక య్యాడని కళాశాల ప్రిన్సిపల్ చిన్నమ్మాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఈతల పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొన్న వివేక్ రెండు వెండి పథకాలు సాధించాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగే పోటీలలో పాల్గొనడానికి అవకాశం దక్కింది.

ఎపిజిఇఎపై విచారణ

- విచారణాధికారిగా సురేష్‌కుమార్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
ఎపి ప్రభుత్వోద్యోగుల సంఘంపై వస్తున్న ఫిర్యాదులపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. గత నెల్లో జరిగిన సాధారణ బదిలీల్లో ఎపిజిఇఎ ఇచ్చిన పలు సిఫార్సు లేఖలపై వచ్చిన ఫిర్యాదులను పురస్కరించుకుని ఈ ఆదేశాలు జారీచేసినట్లు సాధారణ పరిపాలన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ

- దేవాదాయశాఖ కమిషనరుకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
దేవాదాయశాఖలో ఖాళీగా ఉన్న 118 గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఆ పోస్టులను డైవర్ట్ చేయడం విరమించుకోవాలని దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న 118 పోస్టులను కిందిస్థాయి, ఇతర ఉద్యోగులతో అక్రమ మార్గంలో నింపాలనే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలోనూ 21 పోస్టులను ఈ పద్ధతిలోనే నింపుకున్నారని వివరించారు. 118 ఖాళీలను ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని తాము దశలవారీగా 2015 నుంచి పోరాటం చేస్తున్నామని తెలిపారు.

సంపాదకీయం

డబుల్ ఇంజిన్ విధ్వంసం

నింగి నేలా ఏకమైన తీరు.. ఎత్తైన జలపాతాలు.. విశాలమైన తోటలు, చూపు తిప్పునివ్వని గడ్డిపూలు ఎటుచూసినా రమణీయత ఉట్టిపడే ప్రకృతి సోయగాల మణిపూస..మణిపూర్. ఈశాన్య భారతావనిలో సెవెన్ సిస్టర్స్‌లో ఒకటిగా ఉన్న ఈ కొండ ప్రాంత రాష్ట్రం నెల రోజులుగా రక్తమోడుతూనే వుంది. గత మే నెల 3న రాజుకున్న హింసాగ్ని చల్లారడం లేదు. లోయలో మెజార్టీ తెగ మైతేయి గ్రూపునకు, మైనార్టీ కుకి - నాగా ఆదివాసీలకు మధ్య ఘర్షణల్లో ఇప్పటి వరకు 120 మందికి పైగా చనిపోయారు. మరో 300 మందికి పైగా గాయపడ్డారు. వందలాది మంది ఆచూకీ కానరావడం లేదు. 115 గిరిజన గ్రామాల్లో 3000కు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. దాదాపు 250కి పైగా చర్చిలు నేలమట్టమయ్యాయి. కోటిన్నర మంది సహాయక శిబిరాల్లో తలదాచుకున్నారు. ఇంతటి విధ్వంసానికి, హింసకు కారణమెవ్వరు అంటే వేళ్లన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్న బిజెపి 'డబుల్ ఇంజిన్' వైపే చూపుతున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉంది కాబట్టి రాష్ట్రంలోనూ బిజెపినే గెలిపించుకుంటే ప్రగతి పరుగులెడుతుందంటూ ఎన్నికల సభల్లో ఊదరగొట్టే కాషాయ నేతలు మణిపూర్ అశాంతికి ఏమని బదులిస్తారు? ఇదేనా డబుల్ ఇంజిన్ ప్రగతి?

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన సమయంలోనూ దాడులు కొనసాగాయంటే శాంతిభద్రతలు ఎంతటి ఘోరమైన స్థితిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 2002లో గుజరాత్‌లో జరిగిన గోద్రా అనంతర మారణహోమాన్ని ప్రస్తుత మణిపూర్ హింసాకాండ గుర్తు చేస్తోంది. నాడు గోద్రా రైలు తగలబడిందన్న పేరుతో మైనార్టీ ముస్లింలపై పెద్దఎత్తున మారణకాండ సాగింది. ప్రభుత్వ అండదండలతో సంఘ్ పరివార్ మూకలు పగ్గాలు తెగిన ఆంబోతుల్లా మైనార్టీల మానప్రాణాలను బలిగొన్నాయి. 2000 మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. బిల్కిస్ బానో వంటి ప్రత్యక్ష బాధిత సాక్షులతో తడారని నెత్తుటి పుండులా గుజరాత్ మారణకాండ ఈనాటికీ కళ్ల ఎదుటే కదలాడుతోంది. మణిపూర్‌లోనూ ఇప్పుడు నడుస్తున్నది అలాంటి విధ్వంసమే.

మెజారిటీ మైతేయిలను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చే ప్రక్రియపై నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో కుకి గ్రూపు ఆదివాసీలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ర్యాలీపై గుర్తు తెలియని దుండగుడు తూటాలతో విరుచుకుపడ్డాడు. దీంతో హింస రాజుకుంది. మైతేయిలకు బిజెపి అండదండలు పుష్కలంగా ఉన్నందున .. కారులో వచ్చి కాల్పులు జరిపి ఉడాయించిన ఆ దుండగులు ఎవరి పరివారమో వేరే చెప్పనవసం లేదు. మణిపూర్ లోయ నుండి క్రిస్టియన్ కుకీ-నాగా తెగలను తరిమికొట్టి మైజారిటీ మైతేయిల మెప్పుతో అధికారంలో అంటకాగాలనే దుర్బుద్ధితోనే బిజెపి ఈ నాటకాలు ఆడుతోంది. ఇప్పటికే మైనార్టీ ఆదివాసీ తెగలను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం యత్నించింది. దీంతో వారిలో తీవ్ర అభద్రత నెలకొంది. ఈ హింసాకాండలో కూల్చివేసిన ఇళ్లలో అత్యధికం కుకి గ్రూపు ఆదివాసీలవే. మూడేళ్ల కిందటే సర్వే పేరిట గిరిజనుల ఇళ్లకు మార్కు చేయడం, ఇప్పుడు ఆ ఇళ్లనే నేలమట్టం చేయడం, మణిపూర్ పోలీసు శిక్షణా అకాడమీ నుంచి మైతేయిలు ఆయుధాలు ఎత్తుకెళ్తున్నా మిన్నకుండిపోవడం ఇవన్నీ..డబుల్ ఇంజిన్ విధ్వంస రచనకు దర్పణం పడతాయి. సామరస్యంగా జీవిస్తున్న గిరిజన తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి వైషమ్యాలు సృష్టించి బిజెపి ప్రమాదకరమైన మతతత్వ ఎజెండాను అమల్జేస్తోంది.

మణిపూర్ హింసాకాండపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని సర్వత్రా డిమాండ్ చేస్తుంటే.. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కనుసన్నల్లో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తామనడం దేనికి సంకేతం? మైతేయి, కుకి గ్రూపులకు, కేంద్ర ప్రభుత్వం మధ్య కుదిరిన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (సూ) ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని అమిత్ షా హెచ్చరించారు. ఒక వైపు మైతేయిలకు ఆయుధాలు అందుబాటులో ఉంచుతూ మరోవైపు కుకిలు ఆయుధాలు అప్పగించాల్సిందేనంటూ హెచ్చరికలు జారీ చేయడం బిజెపి పాలకుల దుర్మార్గాన్ని ప్రతిబింబిస్తోంది. ఆదివాసీ కుకి గ్రూపుపై మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తీవ్రవాద ముద్ర వేస్తే..అమిత్ షా ఏకంగా బెదిరింపులకే దిగడం ఆగ్రహంతో ఉన్నవారిని మరింత రెచ్చగొట్టడమే. ఇప్పటికైనా బెదిరింపు ధోరణలను మానుకొని విద్వేష నాటకాలకు తెరదించి చర్చల ప్రక్రియ ద్వారా శాంతి పున:స్థాపనకు పాలకులు ఉపక్రమించాలి. డబుల్ ఇంజిన్ నినాదాల మాటున విధ్వంసకర, హింసాత్మక 'బుల్డోజర్' రాజకీయాలు సాగిస్తున్న బిజెపి దుష్ట పన్నాగాల పట్ల దేశ ప్రజానీకం, ప్రధానంగా ఆదివాసీలు, దళితులు అప్రమత్తంగా ఉండాలి.

మంచి మాట



బిడ్డల పాలకై బిచ్చమెత్తు దేశంలో
రాళ్లకు పాలిచ్చు కథ నశించుదెన్నడో
పేడకు బొట్టెట్టి దైవమని పూజించువారు
పేదను గుర్తించగ మారబోవుదెన్నడో
ఎప్పడొచ్చును దేశానికి చైతన్యం
అది తెచ్చుటగదా మన కర్తవ్యం!

- కరుణానిధి

జయంతి : 3.6.1924
వర్ధంతి : 7.8.2018

కమ్యూనిస్టు విలువల నిబద్ధతకు నిలువుటద్దం 'పర్స'

నివాళి

మంతెన సీతారాం

'పర్స'గా రాష్ట్రమంతా ఆప్యాయంగా, గౌరవంగా పిలుచుకొనే పర్స సత్యనారాయణ 1924 జూన్ 4న పుట్టారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) కంభంపాడు స్వగ్రామం. 18 ఏళ్ళ వరకు ఆ ప్రాంతంలోనే ఉన్నారు. గుంటూరు పట్టణంలో ఎస్.ఎస్.ఎల్.సి పూర్తి చేశారు. తదనంతరం ఉద్యోగం కోసం ఖమ్మం జిల్లా సింగరేణి గనుల ప్రాంతానికి బయలుదేరి వెళ్ళారు. సింగరేణి గనులలో గుమస్తా ఉద్యోగం వచ్చింది. సింగరేణి గనులలో కార్మికులను సంఘటిత పరిచి యూనియన్ నిర్మాణం చేయడం కోసం నెల్లూరు నుండి కొత్తగూడెం వెళ్లిన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శేషగిరిరావుతో పరిచయమయ్యింది. శేషగిరిరావు సింగరేణి గనులలో తొలిగా యూనియన్ నిర్మాణం చేసే పనుల్లో పర్స తోడయ్యారు. యూనియన్ నిర్మాణం అయ్యింది. పర్స ఆ యూనియన్‌లో ఒక ముఖ్య నేతగా ఎన్నికయ్యారు. యూనియన్ కార్యకలాపాలపై కన్నెర్ర చేసిన అప్పటి యాజమాన్యం (బ్రిటిష్, నిజాం ఉమ్మడి యాజమాన్యం) పర్సను ఉద్యోగంలో నుండి తీసివేసింది. అప్పటికే తెలంగాణలోని బొగ్గుగనులున్న అన్ని ప్రాంతాల్లో యూనియన్ ప్రారంభమయ్యింది. పర్సను ఉద్యోగంలో నుంచి తీసివేసినందుకు బొగ్గు గని కార్మికులు తీవ్రంగా నిరసించారు. కొత్తగూడెం బొగ్గు గని కార్మికులు గనులను బహిష్కరించి సమ్మెను ప్రారంభించారు. బొగ్గు ఉత్పత్తి స్తంభించిపోయింది. కార్మికుల నిరసనకు వంగి వచ్చిన యాజమాన్యం 24 గంటల్లోనే మరల పర్సను ఉద్యోగంలోకి తీసుకుంది. సమ్మె జయప్రదం కావడంతో కొత్తగూడెం, ఇతర ప్రాంతాల్లో బొగ్గు గని కార్మికుల్లో పెద్ద విజయోత్సాహం వెల్లివిరిసింది. కార్మికుల సమ్మెతో ఉద్యోగం మరల వచ్చినా ఉద్యోగంలో చేరలేదు. యూనియన్ ప్రధాన నేత శేషగిరిరావు సలహా, ప్రోత్సాహంతో ఉద్యోగంలో మరల చేరకుండా యూనియన్ పూర్తి కాలం కార్యకర్తగా పని చేయడానికి నిర్ణయించుకొని యూనియన్ ఆర్గనైజర్‌గా తొలి ఉద్యమ జీవితం ప్రారంభించారు.

సింగరేణి గనులలో తొలి కార్మిక సంఘంగా నిలదొక్కుకుని అనతి కాలంలోనే తెలంగాణ అంతటా పెద్ద సంఘంగా సింగరేణి యూనియన్ అభివృద్ధి చెందింది. దాని ప్రధాన నేతగా పర్స ఎదిగారు. సమర్ధవంతంగా యూనియన్ నాయకుడిగా పని చేశారు.

సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన పర్స సింగరేణి కార్మిక నేతగా కార్మికులతో మమేకమై అనతి కాలంలోనే కార్మిక వర్గ దత్తపుత్రుడిగా, ఉత్తమ శ్రేణి కార్మిక నాయకుడిగా రూపొందారు. కార్మిక యూనియన్‌లో కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణం జరిగింది. 1943లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులయ్యారు. సింగరేణి యూనియన్ జనరల్ సెక్రటరీగా దీర్ఘకాలం పని చేశారు. 1946వ సంవత్సరం అనంతరం వీర తెలంగాణ విప్లవ పోరాటం ప్రారంభమయ్యింది. పార్టీ నిర్ణయం మేరకు పాల్వంచ అటవీ ప్రాంతంలో సాయుధ దళాల నాయకుడిగా విప్లవ స్థావరానికి చేరుకున్నారు. 1947 చివరిలో నిజాం ప్రభుత్వం అరెస్టు చేసి 6 సంవత్సరాల పాటు జైల్లో పెట్టింది. తీవ్ర నిర్బంధంలో విప్లవ వీరుడిగా పర్స రాటు తేలారు. 1953లో జైలు నుండి విడుదలైన అనంతరం బహిరంగంగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో ముమ్మరంగా పని చేయడం ప్రారంభించారు.

తుపాకి ఎక్కుపెట్టినా చెక్కు చెదరని ధీరుడు

వీర తెలంగాణ విప్లవ పోరాటం జరుగుతున్న కాలంలోనే ఒక రోజు నిజాం పోలీసులకు దొరికిపోయారు. ఆయనను సంకెళ్ళు వేసి నిజాం మిలట్రీ క్యాంపుకు తీసుకువెళ్ళారు. అప్పటికే ఆయనను కనిపిస్తే కాల్చి వేయమనే ఆదేశం జారీ చేసి ఉంది. ఆయనను తుపాకితో కాల్చడానికి పోలీస్ అధికారిని కూడా నిర్ణయించారు. పోలీస్ క్యాంపులో చేతులు విరిచి తాళ్ళతో కట్టివేశారు. ఆయనను కాల్చి వేయడానికి తుపాకి, పోలీస్ అధికారి సిద్ధంగా ఉన్నారు. మరణ శాసనం చేసిన నిజాం ప్రభుత్వం పర్స మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయింది. మృత్యువు కళ్ళ ముందు నర్తిస్తున్నా పార్టీ పట్ల ప్రజల పట్ల అచంచల విశ్వాసాన్ని ఘంటాపథంగా ప్రకటించారు పర్స. ప్రశాంత వదనంతో ఆయన ముఖం కాంతివంతంగా ఉంది. ఆయనను తుపాకి పెట్టి కాల్చాల్సిన పోలీస్ అధికారి ఆయన వ్యక్తిత్వం, ప్రజాయోధుడిగా ఆయన చరిత్ర తెలిసినవాడు. అధికారి మానవత్వంతో తుపాకిని ఎక్కుపెట్టలేదు. 'పర్స మీరు వెళ్ళండి' అని చెప్పి వెళ్ళిపోయాడు. అనంతరం నిజాం పోలీసులు ఆయనను జైలుకు తీసుకువెళ్ళారు.

జైళ్ళ హింసను ఎదుర్కొన్న విప్లవ వీరుడు



పర్స సత్యనారాయణ శత జయంతి సందర్భంగా

జైళ్ళలో ఆయనకు కఠిన శిక్షలు అమలు చేయాలని నిజాం ప్రభుత్వం ఆదేశం జారీ చేసింది. చీకటి గదిలో ఒక్కరినే నెలలు తరబడి బంధించి ఉంచేవారు. కాళ్ళకు, చేతులకు బేడీలు వేసి వాటిని పొడవాటి గొలుసులతో కట్టి జైలు గది ఊచలకు రాత్రి పగలూ కట్టి ఉంచేవారు. అత్యంత నాసి రకం భోజనం, నెలలు తరబడి నిద్ర లేని రాత్రులతో పర్స జైలు జీవితం ఎంత నరకంగా ఉన్నా ఆయన మనోస్థైర్యాన్ని నిజాం ప్రభుత్వం దెబ్బతీయలేకపోయింది. పోలీస్ క్యాంపులలో ఆయనను తీవ్ర చిత్రహింసలకు గురి చేసినా పార్టీ కార్యకలాపాలు గురించి, సాయుధ పోరాట స్థావరాలు గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా గొప్ప మనోధైర్యాన్ని ప్రదర్శించేవారు. రెండుసార్లు అతి చాకచక్యంగా జైలు గోడలు దూకి అడవులలోని సాయుధ పోరాట స్థావరాలకు చేరుకొని పోరుకు నాయకత్వం వహించారు.

ఉత్తమ పోరాట యోధుడు

ఉన్నత వ్యక్తిత్వం, అత్యున్నత త్యాగం, మచ్చలేని విప్లవ జీవితం, విలువలు, విధానాల పట్ల నిబద్ధత, ఉక్కు క్రమశిక్షణ ఉత్తమ పోరాట యోధుని లక్షణాలు. ఆ లక్షణాలన్నీ మూర్తీభవించిన వ్యక్తి పర్స. ఆందోళకారుడిగా, పోరాట యోధుడిగా, ప్రచారకుడిగా, నిర్మాణ దక్షుడిగా ఈ నాలుగు లక్షణాలు సమపాళ్ళలో సంతరింప చేసుకున్న సంపూర్ణ నాయకుడు పర్స. ఆయన మంచి ఆందోళనకారుడు. జీవిత చరమాంకంలో సైతం ఆయన కలం ఆగలేదు. కవితలు, వ్యాసాలు రాయడం మానలేదు. ఉద్యమ జీవితంలో ఎన్నో కరపత్రాలు, వ్యాసాలు రాసిన ఆయన చేయి తిరిగిన రచయిత.

ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం వరకూ కార్మిక రంగ కార్యకర్తలను కర్తవ్యోన్ముఖులను చేస్తూ వేలాది లేఖలు రాసిన చేయి ఆయనది. కార్మికవర్గ పోరాటాలలో అసంఖ్యాకంగా ఆయన చేసిన ఉపన్యాసాలు ఆంధ్రప్రదేశ్ లోని లక్షోపలక్షల కార్మికులను ఎంతగా ప్రభావితం చేసిందీ ఆయన సహచరులందరికీ తెలిసిందే. ఆయన సాదాసీదా కమ్యూనిస్టు యోధుడు కాదు. వీర తెలంగాణ విప్లవ పోరాటంలో తుపాకి పట్టి గెరిల్లా దళాలను సమర్ధంగా నడిపించిన విప్లవ నేత. కార్మికోద్యమ నేతగా తెలుగునాట అసంఖ్యాక ఉద్యమాలకు, పోరాటాలకు నాయకత్వం వహించారు. విజయాలు సాధించారు.

ప్రజాప్రతినిధులకు ఆయన ఆదర్శం

పాల్వంచ శాసన సభ నియోజకవర్గానికి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా 1962లో ఘన విజయం సాధించారు. నియోజకవర్గం అంతా నిరంతరం పర్యటిస్తూ ప్రజల ఎమ్మెల్యేగా పేరు పొందారు. విశాఖ ఉక్కు ఉద్యమం సందర్భంగా పార్టీ నిర్ణయంతో రాజీనామా చేశారు. 1962 నుండి తుది శ్వాస విడిచే వరకూ ఎమ్మెల్యేకు వచ్చే జీతభత్యాలన్నీ ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీకి అణా పైసలతో సహా జమ కట్టేవారు. మాజీ ఎమ్మెల్యేకి వుండే ఏ ప్రత్యేక సదుపాయాలను ఆయన ఎప్పుడూ వాడుకోలేదు. అత్యంత నిరాడంబరంగా ఆయన, ఆయన కుటుంబం జీవించింది. వీర తెలంగాణ విప్లవ పోరాటంలో పాల్గొన్న యోధులను కూడా కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించింది. నాయకత్వ స్థానాల్లో ఉన్న ఎవ్వరూ తామ్రపత్రం స్వీకరించవద్దని, పాసు, పెన్షను, ప్రయాణ సౌకర్యాలను వాడుకోవద్దని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని పర్స తుచ తప్పకుండా జీవితకాలమంతా అమలు చేశారు.

ఆయన... ఆయన కుటుంబం...

పందొమ్మిదవ ఏట కొత్తగూడెంలో కమ్యూనిస్టు అయిన పర్స అంచలంచెలుగా ఎదిగి పార్టీలో, కార్మిక రంగంలో రాష్ట్ర అగ్రనేతల్లో ఒకరుగా అభివృద్ధి చెందారు. సనాతన సాంప్రదాయ కుటుంబంలో పుట్టి 'యజ్ఞోపవీతం' విసర్జించి 'విప్లవపథం'లో నడిచారు. కొద్దిపాటి బట్టల సంచితో ఉద్యోగం కోసం కారేపల్లి (ఖమ్మం జిల్లా బొగ్గు గనుల ప్రాంతం) వచ్చిన ఆ యువకుడు....72 ఏళ్ల ఉద్యమ జీవితంలో ఏనాడూ స్థిర, చర ఆస్తుల సంపాదనకు వెంపర్లాడలేదు. ఆ ఆలోచననే దరి చేరనియ్యలేదు. పార్టీ ఇచ్చే పరిమితమైన భత్యంతో మాత్రమే కుటుంబాన్ని పోషించేవారు. కామ్రేడ్లు, మిత్రులు ఏ సహాయం చేయడానికి ముందుకు వచ్చినా నిరాకరించేవారు. నిత్యం కుటుంబంలో దరిద్రం తాండవిస్తున్నా చలించేవారు కాదు. 19వ ఏట ఏ ఆస్థి లేని పర్స ఎలాగైతే వున్నారో 91వ ఏట తుది శ్వాస వరకూ అదే విధంగా ఉన్నారు. నీతి, నియమాలు, విలువలు, విధానాలు ప్రాణంగా భావించి యావజ్జీవితం నిప్పు లాంటి మనిషిగా బతికారు. ఆయన జీవితంలో ఇన్ని విజయాలు సాధించడానికి ఆయన భార్య భారతీదేవి సహకారం ఆయనకు వరం. ఆమె ఎప్పుడూ పర్స విప్లవ పథానికి అడ్డు రాలేదు. ఆమె కూడా భర్తతోపాటే పార్టీ కార్యకర్తగా, కొత్తగూడెం కార్మికులకు అమ్మగా, ఐద్వా నాయకురాలిగా సముచిత పాత్ర వహించారు.

ఓపిక ఉన్నంత వరకూ కాదు...
ఊపిరి ఉన్నంత వరకూ...ఉత్తమ కమ్యూనిస్టు

పర్స జీవిత చరమాంకంలో పది సంవత్సరాల పాటు పర్స దంపతులు చిన్న కుమార్తె లీలా ఇంట్లో (ఏలూరు)లో ఉన్నారు. రెండు చిన్న గదులు ఉన్న ఆ ఇంట్లో ఓ చిన్న గదిలో అతి సామాన్య జీవనం గడిపారు. ఏ ప్రత్యేక సదుపాయాలు కోరుకోలేదు. ఏలూరులో నిత్యం పార్టీ ప్రజా రంగాల కార్యకర్తలతో ఇష్టాగోష్టి సమావేశాలు నిర్వహించి ఉత్తేజపరిచేవారు. ఉత్సాహపరిచే వారు. ఉద్యమ అనుభవాలు చెప్పి వారిలో చైతన్య స్ఫూర్తిని నింపేవారు. చివరి శ్వాస వరకు అధ్యయనం ఆపలేదు. రాత్రి, పగలు అదే పనిగా పార్టీ సాహిత్యం, ప్రజా సంఘాల పత్రికలు చదివేవారు. కార్మిక లోకం గురించి జిల్లాలకు లేఖలు రాసేవారు. పార్టీ ధ్యాసే శ్వాసగా బతికారు. 2015 మే 22న తుది శ్వాస విడిచారు.

(వ్యాస రచయిత సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

జనవాక్యం

పార్లమెంట్ సౌధంలో చర్చల సంస్కృతి

పలు వివాదాల నడుమ ఒక చారిత్రక ఘట్టం పూర్తయ్యింది. పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని ఉత్సవ వాతావరణంలో ఆవిష్కరించారు. అందమైన, సౌకర్యవంతమైన, అధునాతన భవనాన్ని ప్రారంభిస్తూ 'ఇది 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు కేంద్రం' అంటూ ప్రజాస్వామ్య దేవాలయాన్ని కొనియాడారు. అయితే ఆ పండుగకు 20 ప్రతిపక్షాలు గైర్హాజరు కావడం లోటే అయినప్పటికీ వారి కారణాలు కూడా కొట్టిపారేయదగినవి కాకపోవడం గమనార్హం. పార్లమెంట్ చర్చల్లో ఏకాభిప్రాయం కుదరనట్టే, పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ విధానం కూడా చర్చనీయాంశం అయ్యింది.ఏది ఏమైనా ఆజాదీ అమృతోత్సవాల వేళ భారత్ నూతన సౌధం నుంచి సరికొత్త స్ఫూర్తితో ముందడుగు వెయ్యాలనుకుంటుంది. ప్రధాని మాటల్లో ఆ ఆకాంక్ష ద్యోతకమైంది. అందుకు తగ్గట్టుగా చేపట్టాల్సిన మార్పులు చాలానే ఉన్నాయి. రానురానూ పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చల మాట అటుంచి అసలు చర్చలే తగ్గిపోతున్నాయి. తొలి సభకు, నేడు నడుస్తున్న 17వ లోక్‌సభకు చర్చాకాలం సగానికన్నా తక్కువ రోజులకు పడిపోయింది. బహుశా ప్రస్తుత సభ కనిష్ట కాలం చర్చలు జరిగిన సభగా గుర్తింపుకు నోచుకోవచ్చు. ముఖ్యమైన ఆర్థిక బిల్లులు, ప్రాముఖ్యత కలిగినవి కూడా నిమిషాల్లో పాస్ అవుతున్నాయి. అధికార, ప్రతిపక్షాలు తమ మాటే నెగ్గాలన్న ధోరణికి కట్టుబడి, పట్టువిడుపులు ప్రదర్శించడం లేదు. సెషన్స్ తుడిచిపెట్టుకుపోవడం మామూలైంది. లోతుగా పరిశీలించాల్సిన బిల్లుల్ని స్టాండింగ్ కమిటీలకు పంపే ఆచారం దూరమౌతున్నది. అర్థవంతమైన చర్చల స్థానంలో వెంటనే వార్తలకెక్కగల ప్రసంగాలు, విషయ ప్రాధాన్యత కన్నా, ఉద్వేగభరిత వ్యాఖ్యానాలు ముందువరసకు వస్తున్నాయి. వైరిపక్షాలు భిన్న కోణంలో ఒక సమస్యను, పరిష్కారాన్ని చూసి చివరకు ఒక ఉత్తమమైన నిర్ణయానికి రావడం చర్చల ముఖ్య ఉద్దేశ్యం.అలా చేస్తే ప్రజలకు, దేశానికి మేలు. ఇద్దరి గమ్యమూ ఒకటే అయినప్పుడు చర్చలేవీ పక్కదారి పట్టవు. ఒకరిని ఒకరు గౌరవించడం సాధ్యమౌతుంది. ఇప్పుడు కొరవడింది ఆ ప్రజాస్వామ్య స్ఫూర్తియే. నూతన భవనంలో మళ్ళీ నూతనంగా ఆ మంచి సంస్కృతిని ప్రతిష్ఠించుకోవాలి. అందుకు ప్రధాని పార్లమెంట్‌లో నాయకుడిగా, ప్రజల ప్రతినిధిగా చొరవ చూపాలి.

- డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

దేశానికి కామ్రేడ్స్ కావాలి

సమస్య

"నీ హక్కు కోసం నువ్వు పోరాడాలి. దాన్ని నువ్వు ధైర్యంగా అడగాలి. దానికోసం ఏ కష్టాన్నైనా ఎదిరించాలి. దాన్ని సాధించడం కోసం నువ్వు చేసే ప్రయాణంలో నీకు తోడొచ్చే వాడే కామ్రేడ్!" అంటూ 'డియర్ కామ్రేడ్' సినిమాలో హీరో తాతయ్య వివరిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్ ఒక క్రికెట్ క్రీడాకారిణి. క్రికెట్ బోర్డుకు చెందిన అధికారి తనను లైంగికంగా వేధిస్తున్నప్పుడు ప్రతిఘటించిన ఆమెను, ఆమె స్నేహితురాలిని అకాడమీ నుండి బయటకు వెళ్లేలా చేస్తాడు. తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌కు దూరమై, ఇంత చేసిన అతన్ని ఏమీ అనలేక, బయటకు తెలిస్తే తమ పరువు పోతుందనుకునే తల్లిదండ్రుల నీడన ఉన్న ఆమె డిప్రెషన్ లోకి వెళుతుంది. తనని అవమానించిన, మానసికంగా హింసించిన, తన భవిష్యత్తునే కాలదన్న చూసిన వాడి నిజస్వరూపం బయటపెట్టిన తర్వాతే ఆమె డిప్రెషన్ నుంచి నిజంగా బయటకు వస్తుంది. దీనికి తన వెంట ఉండి నిలబడినవాడే సినిమాలో హీరో, కామ్రేడ్.

ఇలాంటి పోలిక ఉన్న కథే నేడు దేశ రాజధానిలో నిజ జీవితంలో జరుగుతున్నది. దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని, అవార్డులను తెచ్చిన మహిళా రెజ్లర్లను...'భారత కుస్తీ సమాఖ్య'



ఎం.డి. షకీల బేగం

(డబ్ల్యు.ఎఫ్.ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎం.పి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు వారు ఆరోపణ చేశారు. వేధింపులు చేసిన వారిపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం, దానికోసం నెలల తరబడి రోడ్లపై నిరసన తెలపాల్సి రావటం, స్వయంగా ప్రధానితో చెప్పినా పట్టించుకోకపోవడం, బాధితులను బెదిరింపులకు గురిచేయడం, సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన తర్వాత గానీ నామమాత్రంగా కేసు నమోదు చేయడం, దీనిపై వేసిన కమిటీ పారదర్శకత లేని విచారణ జరిపి నిందితునికి క్లీన్ చిట్ ఇచ్చేయడం అన్నది మహిళల ప్రాథమిక హక్కులను కాలరాయడం కన్నా మించినదని ఇట్టే అర్థమైపోతుంది. అధికారంలో ఉన్న మహిళా రాజకీయ ప్రతినిధులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు నటించడం, కనీసం స్పందించకుండా పరుగులు తీయడం (కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి), క్రీడారంగం లోనే ఉన్న మహిళలు సైతం నిరసన తెలుపుతున్న వారిని తప్పు పట్టడం ఇంకా తుప్పు పట్టి ఉన్న వ్యవస్థను ప్రతిబింబింపజేస్తుంది.

> ఇది కేవలం మల్ల యోధుల పోరాటం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి, ధనస్వామ్యానికి జరుగుతున్న పోరాటం. ఈ పోరాటానికి... స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారి ముందు రొమ్ము విరుచుకుని నిలబడిన కామ్రేడ్లు కావాలి. ఎన్.ఆర్.సి లాంటి కుట్ర పూరితమైన పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కామ్రేడ్లు కావాలి. రైతు ఉద్యమంలో దేశ ప్రధాని మెడలు వంచిన కామ్రేడ్లు కావాలి. ఇటువంటి కామ్రేడ్స్ లేకుండా ప్రపంచంలో ఏ హక్కూ సాధించలేదు. అందుకే .. రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ, మహిళలను లైంగిక వస్తువుగా చూసే నీచులకు బుద్ధి చెప్పే వరకు...ఈ పోరాటం సాగాలి.

నిర్భయ ఘోరం జరిగినప్పుడు ఆ సమయంలో ఆమె ఎందుకు బయటకు వెళ్లాలి అనీ, బన్వారీ దేవి (రాజస్థాన్) కేసులో ఎవరికో బాల్య వివాహం చేస్తుంటే ఆమెకేంటని, రెజ్లర్ల విషయంలో అసలు ఆడపిల్లలకు ఇలాంటి ఆటలు ఎందుకని మాట్లాడే వ్యవస్థను పాలకులు ఇంకా ఇంకా కొనసాగించాలనే ఈ రోజు పాలక పార్టీకి చెందిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తప్పు చేశాడని తెలిసి కూడా వెనకేసుకొస్తోంది.

బన్వారీ దేవి కేసులో మొట్టమొదటిసారిగా...పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది వారి ప్రాథమిక హక్కు అని పేర్కొంటూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇచ్చింది. ఆర్టికల్ 14, 15, 19, 21 ప్రకారం లైంగికంగా వేధించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుంది. కానీ రాజ్యాంగ హక్కు కాదు కదా కనీసం నైతిక విలువలు కానీ మానవీయ కోణం కూడా లేని దృశ్యాలు దేశంలో చోటు చేసుకుంటున్నాయి.

కొందరు బలైన తర్వాతే చట్టాలు వచ్చాయి కానీ ఈ చట్టాల అమలు కోసం మరలా పోరాటం చేయవలసి వస్తున్నది. ఈ పోరాటంలో అనేకమంది తమ జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానో కేసులో ఆమె సంవత్సరాల తరబడి పోరాడిన తర్వాత దోషులకు శిక్ష పడింది. అయితే ఆ తర్వాత సంస్కారవంతులనే సర్టిఫికెట్‌తో అంత ఘోరం చేసినవారు బయటకు రావడం...హారతులు ఇవ్వడం చూశాం.

సినిమాలో చివరకు కథ సుఖాంతం అవుతుంది. కానీ నిజ



జీవితములో ఇది నిజంగా సాధ్యమా? ఆ అధికారి వెనుక ఒక రాజకీయ పార్టీ ఉంటే? ఆ అధికారి వెనుక ధనస్వామ్యం ఉంటే? అధికారి వెనుక ఏకంగా అధికార పార్టీ అండదండ ఉంటే...బాధితురాలికీ, ఆమె కుటుంబానికీ పాట్లు తప్పవని ఉత్తరప్రదేశ్ లోని ఉన్నావో దారుణ అత్యాచార ఉదంతం తెలియచేస్తోంది. ఇటువంటి అనేక ఇబ్బందులను ఢిల్లీలో రెజ్లర్లు పడుతున్నారు. అయినా కానీ వారి పోరాట స్ఫూర్తి తగ్గలేదు. మే 28న ఒకపక్క పార్లమెంటు భవన ప్రారంభోత్సవం జరుగుతుంటే మరో పక్క పోలీస్ రాజ్యం యథేచ్ఛగా సాగిపోయింది. నూతన పార్లమెంటు భవనానికి మార్చ్‌గా వెళుతున్న రెజ్లర్లపై పోలీసులు పైశాచికంగా దాడి చేశారు. నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి పోలీస్ వాహనంలో ఎత్తిపడేశారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. సోషల్ మీడియాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రెజ్లర్లకు వ్యతిరేకంగా బిజెపి/ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్ విష ప్రచారం సాగించింది. దీంతో తాము గెలిచిన పతాకాలను గంగలో కలిపేందుకు సిద్ధమయ్యారు రెజ్లర్లు.

దేశవ్యాప్తంగా రైతు, వ్యావసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల మద్దతును రెజ్లర్లు కూడగట్టుకోవడంతో ఈ పోరాటం ప్రజా పోరాటంగా రూపాంతరం చెందింది. ఇది కేవలం మల్ల యోధల పోరాటం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి, ధనస్వామ్యానికి జరుగుతున్న పోరాటం. ఈ పోరాటానికి... స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారి ముందు రొమ్ము విరుచుకుని నిలబడిన కామ్రేడ్లు కావాలి. ఎన్.ఆర్.సి లాంటి కుట్ర పూరితమైన పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కామ్రేడ్లు కావాలి. రైతు ఉద్యమంలో దేశ ప్రధాని మెడలు వంచిన కామ్రేడ్లు కావాలి. ఇటువంటి కామ్రేడ్స్ లేకుండా ప్రపంచంలో ఏ హక్కూ సాధించలేదు. అందుకే రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ, మహిళలను లైంగిక వస్తువుగా చూసే నీచులకు బుద్ధి చెప్పే వరకు ఈ పోరాటం సాగాలి.

కవిత్వం

తెలుసుకోండి

ప్రజాస్వామ్యం నియంతృత్వ
పోకడలు పోతున్నది !
రాజ్యాంగ విలువలు మంట
కలుస్తున్నాయి !
పార్లమెంటులో రాజదండాలతో
మఠాధిపతులతో సమస్యలు
పరిష్కారమైతే
ఈ సాంకేతిక విజ్ఞానం ఎందుకు !
నా దేశాన్ని మఠాధిపతుల
కాళ్ల దగ్గర తాకట్టు పెట్టకండి
ఈ రోజు రాజదండాన్ని తెచ్చారు
రేపు రాజ్యాంగాన్నే మార్చేస్తారా !
మేధావులు, మానవతావాదులు
భయాందోళనతో మౌనం వహించకండి
మీ పోరాట జాడలలో
దేశ భవిత ప్రాణం పోసుకుంటుంది!
ఒక్క పూట తిండితో
వంద కోట్ల మంది బతుకుతున్నారు!
ప్రతి రాత్రి 7 వేల మంది
ఆకలితో కన్నుమూసి
తెలవారు సంధ్యలో శవాలవుతున్నారు.
కూడు గుడ్డ నివాస స్థలాలు లేక
లక్షల మంది అలమటిస్తున్నారు.
విద్య వైద్యం రహదారులు లేక
లక్షల గ్రామాలు తల్లడిల్లుతున్నాయి !
రెవెన్యూ రికార్డుల్లో లేని
వందల గ్రామాలు కనీస
సదుపాయాల లేక
చీకటిలో మగ్గుతున్నాయి !
పండిన పంటకు గిట్టుబాటు
ధరలు లేక కాలచక్రం కింద రైతుల
జీవితాలు సమాధి అవుతున్నాయి !
నిరుద్యోగంతో సగం చచ్చిన
యువతరం చెడు వ్యసనాలకు
బానిసలు అవుతున్నారు
నిర్దయులు క్రూరత్వంతో
రెజ్లర్లపై పైశాచిక దాడులు చేస్తున్నారు
నాలుగు కూడళ్ల మధ్య
ప్రజాస్వామ్యం
అభాసు పాలవుతున్నది !
దేశం ఎక్కడ వెలిగిపోతుందో
నవశకం ఎవరికి ప్రారంభమైందో
కొత్త భారతం ఎంత వేగంగా
పయనిస్తుందో కాస్త తెలుసుకోండి !

- అబ్రహాం పులిపాటి

నేడు పలు రైళ్ల సర్వీసుల రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు

భువనేశ్వర్ : ఒడిశాలోని బాలాసోర్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), బెంగుళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ (12864) అనే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఒకదాని తర్వాత ఒకటి పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దు చేయబడ్డాయి, మళ్లించబడ్డాయి మరి కొన్ని పాక్షికంగా రద్దు చేయబడ్డాయి, శుక్రవారం రాత్రి ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు అందించిన సమాచారం ప్రకారం

శనివారం రద్దయినవి

12074 భువనేశ్వర్-హౌరా జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్
12073 హౌరా-భువనేశ్వర్ జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్
12278 పూరీ-హౌరా శతాబ్ది ఎక్స్‌ప్రెస్.
12277 హౌరా-పూరీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్
12822 పూరీ-షాలిమార్ ధౌలి ఎక్స్‌ప్రెస్
12821 షాలిమార్-పూరి ధౌలి ఎక్స్‌ప్రెస్
12892 పూరీ-బంగిరిపోసి
12891 బంగిరిపోసి-పూరి ఎక్స్‌ప్రెస్
02838 పూరీ-సంత్రగచ్చి స్పెషల్
12842 చెన్నై-షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్
12509 బెంగుళూరు-గౌహతి

రైళ్ల మళ్లింపు:

12815 పూరీ-ఆనంద్ విహార్ (న్యూఢిల్లీ) నందనకానన్ ఎక్స్‌ప్రెస్ 03.06.2023న పూరీ నుండి జఖపూరా-జరోలి మీదుగా నడుస్తుంది.

పాక్షిక రద్దు:

12891 బంగిరిపోసి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ బంగిరిపోసి నుండి జాజ్‌పూర్ కియోంజర్ రోడ్ నుండి భువనేశ్వర్ వరకు బయలుదేరుతుంది . బంగిరిపోసి నుండి జాజ్‌పూర్ కె రోడ్ వరకు రద్దు చేయబడింది.

08412 భువనేశ్వర్-బాలాసోర్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్ నుండి జెనాపూర్ వరకు నడుస్తుంది జెనాపూర్ నుండి బాలాసోర్ వరకు రద్దు చేయబడింది.

18411 బాలాసోర్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ బాలాసోర్ నుండి భువనేశ్వర్‌కు బదులుగా జెనాపూర్ నుండి భువనేశ్వర్ వరకు నడుస్తుంది.

08415 జలేశ్వర్-పూరీ స్పెషల్ జలేశ్వర్ నుండి జలేశ్వర్‌కు బదులుగా భద్రక్ నుండి బయలుదేరుతుంది.






సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు, సహాయక సిబ్బంది

పెను విషాదం

మొదటి పేజీ తరువాయి

వైష్ణవ్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని, త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఘోర ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్కర్, సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నిధుల కొరత కారణంగా సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణాలోపమే ఇంతటి ఘోర విషాదానికి కారణమని రైల్వే రంగ నిపుణులు తెలిపారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హౌరా నుంచి చెన్నయ్ వెళ్తున్న రైలు నెంబర్ 12841 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి 7:08 గంటలకు ప్రమాదానికి గురైంది.

ఈ రైలు ఒడిశాలోని బాలాసోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలో బహనగా బజార్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిగ్నలింగ్ వ్యవస్థలో వైఫల్యం వల్లే ఆగివున్న గూడ్సును గమనించకపోవడమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ రైలులో జనరల్ 2, స్లీపర్ 5, థర్డ్ క్లాస్ ఎసి 9, సెకెండ్ క్లాస్ ఎసి 2, ఫస్ట్ క్లాస్ కోచ్‌లతో కలిపి మొత్తం 18 కోచ్‌లు ఉన్నాయి. 3 స్లీపర్ కోచ్‌లు మినహా 15 కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఏడు బోగీలు పల్టీలు కొట్టాయి. 13 బోగీలు ప్రక్కనే ఉన్న ట్రాక్‌పై పడ్డాయి. అదే సమయంలో సదరు ట్రాక్‌పై వస్తున్న యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఆ బోగీలను ఢీకొట్టింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన మూడు, నాలుగు బోగీలు పట్టాలు తప్పినట్టు రైల్వే అధికారి అమితాబ్ శర్మ తెలిపారు. కోచ్‌ల మధ్య పలువురు ప్రయాణికులు చిక్కుకుపోగా వారిని రక్షించేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బలగాలు, వైద్యులు పెద్ద సంఖ్యలో ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వరకూ సహాయక చర్యలు కొనసాగాయి. దాదాపు 60 అంబులెన్సులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను తరలించారు. భువనేశ్వర్ తదితర ప్రాంతాల నుంచి వైద్యులను తరలించి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రైలులో సుమారు 1800 ప్రయాణికులు ఉన్నారని, ప్రమాద తీవ్రత ఎక్కువగానే ఉందని అధికారులు ప్రకటించారు. సిగ్నల్ లోపం కారణంగా రెండు రైళ్లు ఒకే ట్రాక్ పైకి వచ్చి ఢీకొన్నాయని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు భారీగా ధ్వంసమైంది.

హెల్ప్‌లైన్లు ఏర్పాటు

ప్రయాణికుల వివరాల కోసం హెల్ప్ లైన్ నెంబర్లను రైల్వే శాఖ ప్రకటించింది విశాఖపట్నం వారు 0891-2746330, 0891-2744619, విజయనగరం వారు 08922-221202, 08922-221206, హౌరా వారు 033-26382217, ఖరగపూర్ వారు 8972073925, 9332392339, బాలాసోర్ వారు 8249591559, 7989418322, షాలిమార్ వారు 9903370746 నెంబర్లను సంప్రదించాలని అధికారులు కోరారు.

రూ.10 లక్షల చొప్పున పరిహారం

ఈ ఘోర ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడినవారికి రూ.2 లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడినవారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందజేస్తామని తెలిపారు.

దేశంలో అతిపెద్ద రైలు ప్రమాదాలు

- 1981 జూన్ 6 : బీహార్‌లో సహర్సాకు సమీపంలో భాగమతి నదిలో ఒక ప్యాసెంజర్ రైలు పడిపోయిన ప్రమాదంలో 800 వరకూ మృతి చెందారని ఒక అంచనా.
- 1995 ఆగస్టు 20 : ఉత్తరప్రదేశ్‌లో ఫిరోజ్‌బాద్‌కు సమీపంలో ఆగి ఉన్న కాళింది ఎక్స్‌ప్రెస్‌ను పురుషోత్తమ్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రెండు రైళ్లలో ఉన్న సుమారు 350 మంది మరణించారు.
- 1999 ఆగస్టు 2 : అస్సాంలో గైసాలక్ష అవధ్-అస్సాం ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపుత్ర మెయిల్ ఒకదానికి ఒకటి ఢీకొని 268 మంది మరణించారు.
- 1998 నవంబర్ 26 : పంజాబ్‌లోని ఖన్నా సమీపంలో జమ్ముతావీ ఎక్స్‌ప్రెస్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 212 మంది మరణించారు.
- 2010 మే 28 : పశ్చిమ బెంగాల్‌లో లోకమాన్య తిలక్ జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 170 మంది మరణించారు.
- 1964 డిసెంబరు 23: తమిళనాడులో తుపాను కారణంగా పంబన్-ధనుష్కోటి ప్యాసెంజర్ రైలు కొట్టుకుని పోవడంతో అందులో ఉన్న 150 మంది మరణించారు.
- 2002 సెప్టెంబరు 9 : బీహార్‌లో హౌరా-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 140 మంది మరణించారు.
- 1954 సెప్టెంబరు 28 : హైదరాబాద్‌కు సుమారు 75 కిలో మీటర్ల దూరంలో యసంతి నదిపై వంతెన కూలిపోవడంతో ఒక రైలు నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 139 మంది మరణించారు.
- 1956 సెప్టెంబరు 2 : తెలంగాణలోని జడ్చెర్ల-మహబూబ్ నగర్‌కు మధ్యలో ఒక వంతెన కూలిపోవడంతో జరిగిన ప్రమాదంలో రైలులో ఉన్న 125 మంది మరణించారు.
- 1937 జులై 17 : పాట్నాకు సమీపంలో ఒక ఎక్స్‌ప్రెస్ రైలు కట్టపైకి పడిపోవడంతో 119 మంది మరణించారు.

భూకంపం అనుకున్నాం : బాధిత ప్రయాణికుడు

భూకంపం సంభవించిందేమో అనుకున్నామని క్షతగాత్రుల్లో ఒకరైన ప్రయాణికుడు తన అనుభవాన్ని తెలిపారు. 'బెంబేలెత్తిపోయాం. భూకంపం వచ్చిందనుకున్నాం. మా బోగీ పెద్దగా డ్యామేజీ కాలేదు. ప్రస్తుతానికి రైలు బోగీలోనే ఉన్నాం. కానీ బయటకు వచ్చే వీలులేకుండా ఉంది. గాయపడినవారిని తరలించే పనిలో సహాయక బలగాలు నిమగ్నమయ్యాయి.' అని ఓ మీడియా ఛానెల్‌తో ఫోన్‌లో ఒక ప్రయాణికుడు తెలిపారు.

రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని

ఒడిశా రైళ్ల ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ విపత్తు సహాయ నిధి (పిఎంఎన్‌ఆర్‌ఎఫ్) కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారాన్ని అందించనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.0 వేలు చొప్పున సాయం అందజేస్తామని పేర్కొంది.

బాధిత కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వ సహకారం

రైలు ప్రమాద బాధితుల్లో తమిళనాడుకు చెందినవారు ఎక్కువ మంది ఉండటంతో వారిని స్వస్థలాలకు తరలించేందుకు, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేసింది. ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. తమ రాష్ట్రానికి చెందిన ప్రయాణికులకు సహకరించేందుకు నలుగురి ఉన్నతాధికారుల బృందాన్ని పంపుతున్నామని స్టాలిన్ తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఒడిశా పోలీసు, ఇతర శాఖలతో ఉన్నతాధికారులతో రాష్ట్ర ఉన్నతాధికారులు సంప్రదింపులు జరిపారు. ఏ సహాయానికైనా బాధిత కుటుంబాలు పోలీసు శాఖను సంప్రదించాలని, తాము అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర అడిషనల్ డిజిపి సందీప్ మిట్టల్ తెలిపారు.

ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి ఆరు బృందాలు

బాలాసోర్‌లో రైళ్ల ప్రమాదాల్లో చిక్కుకుపోయిన బాధితులను రక్షించేందుకు శుక్రవారం అర్ధరాత్రి వరకు సహాయక చర్యలు ముమ్మరంగా సాగాయి. జాతీయ విపత్తు సహాయక బలగాలు (ఎన్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన 240 మందితో కూడిన ఆరు బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఎన్‌డిఆర్‌ఎఫ్ డిఐజి మనోజ్ కుమార్ యాదవ్ చెప్పారు.

సహాయక చర్యలపై నవీన్ సమీక్ష

సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ శుక్రవారం రాత్రి సమీక్షించారు. క్షతగాత్రులను వీలైనంత త్వరగా ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సమీక్షా సమావేశం అనంతరం తెలిపారు. ఘటన స్థలానికి శనివారం వెళ్లి పరిస్థితిని పరిశీలిస్తామన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : సిపిఐ డిమాండ్

కేంద్ర ప్రభుత్వం విలాస రైళ్లపైనే అధిక దృష్టి సాధిస్తోందని, సాధారణ రైళ్లు, ట్రాక్కులపై నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఐ ఎంపీ బినోయ్ విశ్వం పేర్కొన్నారు. ఒడిశాలో జరిగిన ఘోర ప్రమాదానికి బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రభుత్వం లక్సరీ రైళ్లపైన మాత్రమే దృష్టి సారిస్తోంది. సాధారణ రైళ్లను, ట్రాకులను పట్టించుకోవడం లేదు. సామాన్య ప్రజల సర్వీసులను నిర్లక్ష్యం చేస్తోంది. ఒడిశాలో రైళ్ల ప్రమాదానికి ఇదే కారణం. రైల్వే మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి' బినోయ్ ట్వీట్ చేశారు.

వివిధ స్టేషన్లలో హెల్ప్‌లైన్లు ..

హౌరా : 033-26382217
ఖరగ్‌పూర్ : 8972073925, 9332392339
బాలాసోర్ : 8249591559, 7978418322
షాలిమార్ : 9903370746
సంత్రగాచి : 8109289460, 8340649469
భద్రక్ : 7894099579, 9337116373
జైపూర్ కియోంజర్ రోడ్ : 9676974398
కటక్ : 8455889917
భువనేశ్వర్ : 06742534027
ఖుర్దా రోడ్ : 6370108046, 06742492245

తొలి 2 నెలల్లో లోటు రూ.32,363 కోట్లు

- ఆదాయం రూ.14,533 కోట్లు
- వ్యయం రూ.46,896 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు నెలల్లో రూ.32,363 కోట్ల లోటు ఏర్పడింది. మే నెల్లో మొత్తం ఆదాయం రూ.6,386 కోట్లు కాగా, వ్యయం రూ.26,576 కోట్లుగా నమోదవ్వడంతో రూ.20,190 కోట్లు లోటుగా లెక్కలు తేలాయి. ఈ లోటును బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా సేకరించిన దాన్ని రూ.15 వేలకోట్లతో, ఇతర సంస్థల నుంచి సేకరించిన మరో రూ.5 వేలకోట్లతో కలిపి భర్తీ చేసింది. గతంలో రూ.15 వేలకోట్ల నుంచి రూ.20 వేలకోట్ల వరకు లోటు కనిపించినా, రూ.30 వేలకోట్లు దాటడం ఇదే మొదటిసారి అని అధికారులు అంటున్నారు. తొలి రెండు నెలల్లో అనుకున్న ఆదాయం తగ్గడమే ఇందుకు కారణంగా అధికారులు చెబుతున్నారు.

నెల	ఆదాయం	వ్యయం	లోటు
ఏప్రిల్	8,147	20,320	12,173
మే	6,386	26,576	20,190
మొత్తం	14,533	46,896	32,363

హింసాకాండలో 98 మంది మృతి

- 310 మందికి గాయాలు
- అధికారంగా ప్రకటించిన మణిపూర్

ఇంఫాల్ : మే 3 నుంచి మణిపూర్‌లో ప్రారంభమైన హింసాకాండలో ఇప్పటి వరకూ 98 మంది మరణించగా, మరో 310 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని మణిపూర్ ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతానికి 272 మంది సహాయక శిబిరాల్లో 37,450 మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపింది. ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) ఈ ప్రకటనను విడుదల చేసింది. అలాగే, హింసాకాండ చెలరేగినప్పటి నుంచి మొత్తంగా 4,014 దహన కేసులు నమోదయ్యాయని తెలిపింది. గత నెల రోజుల్లో రాష్ట్ర పోలీసులు 3,734 కేసులు నమోదు చేసి, 65 మందిని అరెస్టు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితిని స్థానిక పోలీసులతో పాటు ఆర్మీ, అస్సాం రైఫిల్స్, సిఎపిఎఫ్‌లు సిబ్బంది పర్యవేక్షిస్తున్నాయని, వీలైనంత సమన్వయంతో కృషి చేస్తున్నందున హింసాకాండ సంఘటనలు ఇప్పుడు చాలా అదుపులో మారాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించినట్లు తెలిపింది. మరిన్ని బలగాలు రానున్నాయని వెల్లడించింది. భద్రతా సిబ్బంది నుంచి లూటీ చేసిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని అప్పగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఎవరైనా ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ తొలగింపు

సాధారణ పరిస్థితులు నెలకొనడంతో ఐదు జిల్లాల్లో కర్ఫ్యూను తొలగించినట్లు మణిపూర్ ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. ఇతర ప్రాంతాల్లోనూ నిబంధనలను సడలించినట్లు పేర్కొంది. తమెంగ్లాంగ్, నోనీ, సేనాపతి, ఉఖ్రుల్, కమ్‌జోంగ్ జిల్లాల్లో కర్ఫ్యూ ఎత్తివేసినట్లు పోలీసులు వెల్లడించారు. తక్కువ సమస్యాత్మకంగా ఉన్న మరికొన్ని జిల్లాల్లో కొన్ని గంటలపాటు కర్ఫ్యూను సడలించినట్లు తెలిపింది. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, జిరిబమ్, తౌబాల్, కాక్‌చింగ్, చురాచంద్‌పూర్, చందేల్, తెంగ్నౌపాల్, కంగ్‌పోక్పి, ఫెర్జాల్ జిల్లాల్లో కొన్ని గంటలపాటు కర్ఫ్యూను సడలించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో సాధారణ పరిస్థితులే ఉన్నాయని అక్కడి పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 11 మ్యాగజైన్‌లతో కూడిన 144 ఆయుధాలను పోలీసులు చేసుకున్నట్లు మణిపూర్ ప్రభుత్వం తెలిపింది. గత నెల హింసాకాండ సమయంలో భద్రతా సిబ్బంది నుంచి సుమారు 2,000కు పైగా ఆయుధాలను ఎత్తుకెళ్లినట్లు గతంలో ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో ఎకె.47, ఐఎన్ఎస్ఎఎస్ రైఫిల్స్, టియర్ గ్యాస్, స్టెన్ గన్స్, గ్రెనేడ్ లాంచర్, తుపాకీలు ఉన్నాయి.

సంక్షోభంలో పాకిస్తాన్

- 37.97 శాతానికి ఎగబాకిన ద్రవ్యోల్బణం

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయిలో పెరుగుతుండడంతో.. సామాన్య మధ్యతరగతి ప్రజలు అక్కడ జీవించలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. తాజాగా మే నెలలో వార్షిక ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 37.97 శాతానికి పెరిగినట్లు అధికారిక సమాచారం వెల్లడించింది. ఇక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక కన్నా పాకిస్తాన్‌లోనే అత్యధిక స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదైంది.

సామ్‌సంగ్ నుంచి ఒఎల్ఇడి టివిలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ న్యూరల్ క్వాంటం ప్రాసెసర్ 4కెతో ఒఎల్ఇడి టివిలను విడుదల చేసినట్లు తెలిపింది. వీటిని భారత్‌లోనే తయారు చేసినట్లు పేర్కొంది. ఒఎల్ఇడిలో ఎస్95సి, ఎస్90సి సిరీస్‌లను విడుదల చేసినట్లు వెల్లడించింది. వీటిలో 77, 65, 55 అంగుళాలలో మూడు పరిమాణాలలో రూ.169,990 ధర నుంచి ప్రారంభమవుతాయని ఆ కంపెనీ తెలిపింది. రెండేళ్ల వారంటీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇవి లభ్యమవుతాయని పేర్కొంది. వినియోగదారులు ప్రముఖ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లపై గరిష్టంగా 20 శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చని, అదే విధంగా రూ.2,990 నుంచి ప్రారంభమయ్యే ఇఎంఐలను ఎంచుకోవచ్చని తెలిపింది.

జగన్‌ను తిట్టడమే చంద్రబాబు పని

ఎమ్మెల్యే పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబుకు సిఎంగా 14 ఏళ్ల కాలంలో చెప్పుకునేందుకు ఏమీలేక, అబద్ధాలతో సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం, సిఎం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం విడిపోయినందుకు చంద్రబాబు శుభాకాంక్షలు చెప్పడం శోచనీయమన్నారు. 2014 నుంచి 2019 వరకు జూన్ 2న నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపి, ఇప్పుడు శుభాకాంక్షలు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు ప్రజలకు నవంబరు 1న మాత్రమే రాష్ట్రావతరణ వేడుకలు తప్ప జూన్ 2న కాదనేది చంద్రబాబు తెలుసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు ఐటి పరిశ్రమ కోసం నేదురమిల్లి జనార్ధన్‌రెడ్డి ప్రణాళిక తయారు చేస్తే తానే నిర్మించానని చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రోడ్లు, ఫ్లైఓవర్లు, అవుటర్ రింగ్‌రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాదా? అని అన్నారు. కేంద్రం నిర్మించాల్సిన పోలవరాన్ని కమీషన్‌ల కోసం తీసుకుని ఏం చేశారో ప్రధాన మంత్రి నరేంద్ర మోడినే చెప్పారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డే పోలవరాన్ని పూర్తి చేస్తారన్నారు.

కేంద్రం కుట్రలు తిప్పికొడతాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించి, కార్మికులకు వేతన సవరణ చేయకుండా మానసికంగా దెబ్బతీస్తూ కర్మాగారం నిర్వీర్యానికి ప్రయత్నిస్తోన్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 841వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, యుటిలిటీస్, అడ్మిన్, టిటిఐ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు దత్తాత్రేయ, జె.రామకృష్ణ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగేలా చూడాలన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్ల నుంచి పోరాడుతున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. రానున్న కాలంలో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలిచి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఏకతాటిపైకి వచ్చి ఈ పోరాటాలను విజయవంతం చేయాలని కోరారు.

ఐస్ మేక్ లాభాల్లో 184% వృద్ధి

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ కంపెనీ లాభాలు 184.05 శాతం పెరిగి రూ.20.80 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.7.32 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.206.80 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 51.50 శాతం పెరిగి రూ.313.32 కోట్లకు చేరింది. 2023 మార్చి త్రైమాసికంలో 56.02 శాతం వృద్ధితో రూ.8.63 కోట్ల లాభాలు ఆర్జించింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.1.80 డివిడెండ్‌ను చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు.

కోల్ ఇండియాలో వాటాల విక్రయం

కేంద్ర ఖజానాకు రూ.4వేల కోట్లుపైనే



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు, నవరత్న కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)లో మోడీ ప్రభుత్వం మరోసారి వాటాలను విక్రయించింది. తాజాగా మూడు శాతం వాటాను మార్కెట్ శక్తులకు కట్టబెట్టింది. దీంతో రూ.4,000 కోట్లపైనే కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరింది. సిఐఎల్‌లో వాటాల అమ్మకంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యుల్లో తొలి వాటాల ఉపసంహరణ చేసినట్లయ్యింది. రెండు రోజుల ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్)లో ప్రభుత్వం కోల్ ఇండియాలో తన 3 శాతం వాటాకు సమానమయ్యే 18.48 కోట్ల షేర్లను విక్రయించింది. ఒక్కో షేర్‌ను రూ.225కు అమ్మకానికి పెట్టింది. సంస్థాగత ఇన్వెస్టర్లు గురువారం 28.76 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలు చేయగా, శుక్రవారం రిటైల్ కొనుగోలుదారులు 2.58 కోట్ల షేర్లకు, సంస్థాగత బిడ్డర్లు మరో 5.12 కోట్ల షేర్లకు బిడ్లు వేశారు. దీంతో కోల్ ఇండియాలో ప్రభుత్వ వాటా 66.13 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యుల్లో రూ.51,000 కోట్ల విలువ చేసే వాటాలను ప్రయివేటు శక్తులకు విక్రయించాలని మోడీ సర్కార్ బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రవారం బిఎస్ఇలో కోల్ ఇండియా షేర్ 0.15 శాతం పెరిగి రూ.230.90 వద్ద ముగిసింది.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇండియా హెడ్ రాజీనామా



న్యూఢిల్లీ : అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) ఇండియా హెడ్ పునీత్ చండోక్ రాజీనామా చేశారు. భారత్‌లో క్లౌడ్ సేవల మౌలిక వసతులపై 2030 నాటికి 12 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని ఇటీవల ఆ కంపెనీ ప్రకటించింది. ఈ సమయంలో పునీత్ రాజీనామా చేయడం వెనుక కారణాలు తెలియాల్సి ఉంది. కాగా.. ఆయన ఎప్పటి నుంచి వైదొలగనున్నారో కూడా తెలియాల్సి ఉంది. పునీత్ స్థానంలో ఆసంస్థ గ్లోబల్ బిజినెస్ హెడ్ వైశాలి కస్తూరి తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించనున్నారని సమాచారం.

అమెజాన్ పదేళ్ల వేడుకలు

అమెజాన్ ఇండియా 10 ఏళ్ల వేడుకలను జూన్ 5న నిర్వహించుకోనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ముంబయి కేంద్రంగా కేవలం 100 మంది విక్రేతలతో ప్రారంభమై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని పిన్‌కోడ్‌లలో వినియోగదారులకు అనేక రకాల ఉత్పత్తులను అందిస్తున్నట్లు తెలిపింది. అత్యంత మారుమూల ప్రాంతాలతో సహా చిన్న వ్యాపారాలను డిజిటల్‌గా వేదికపైకి తీసుకురావడంపై అమెజాన్ దృష్టి సారించినట్లు తెలిపింది. "10వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కోట్లాది మంది వినియోగదారులు, విక్రేతల కోసం కొత్త ఆవిష్కరణలకు కట్టుబడి ఉన్నాము. వార్షికోత్సవం సందర్భంగా పలు డిస్కౌంట్లు అందిస్తున్నాము. మేము ఒక్క కోటి ఎస్ఎంబిలను డిజిటలైజ్ చేయడం, ఇ-కామర్స్ ఎగుమతుల్లో 20 బిలియన్ డాలర్ల వ్యాపారానికి చేరుకోవడం, 2025 నాటికి 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము." అని అమెజాన్ ఇండియా కన్స్యూమర్ బిజినెస్ కంట్రీ మేనేజర్ మనీష్ తివారీ పేర్కొన్నారు.

రూ.5000 కోట్ల సమీకరణలో బిఒబి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) రూ.5,000 కోట్ల నిధులను సమీకరించనుంది. 2024 మార్చి 31 నాటికి కాపిటల్ ఇన్‌స్ట్రుమెంట్ అదనపు టైర్-1, టైర్-2 ద్వారా నిధులను పొందడానికి ఆ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు శుక్రవారం ఆమోదం తెలిపారు. భారతదేశం, విదేశాలలో పరస్పర మార్పిడి ఆప్షన్‌తో కూడిన మూలధన సాధనాల ద్వారా విడతల వారిగా ఈ నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బిఒబి రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో బిఒబి నికర వడ్డీ ఆదాయం పెరగడంతో లాభాలు 168 శాతం వృద్ధితో రూ.4,775 కోట్లుగా నమోదయ్యాయి. 2022-23లో స్థూలంగా 94 శాతం పెరిగి రూ.14,110 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇంతక్రితం ఏడాది రూ.7,272 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022-23కు గాను రూ.10 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.5.5 డివిడెండ్‌ను సిఫారసు చేస్తూ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు.

రూ.113తోనే ఎయిర్‌టెల్ అంతర్జాతీయ రోమింగ్

న్యూఢిల్లీ : రోజుకు రూ.133 కన్నా తక్కువతో అంతర్జాతీయ రోమింగ్ ప్లాన్ అందిస్తున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. ఇది ఆయా దేశాలలోని ఇతర నెట్‌వర్క్‌లు అందించే ధరలతో పోల్చితే చౌక అని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే హైదరాబాద్ నుంచి విదేశాలకు వెళ్లే వినియోగదారుల ప్యాక్‌ల సబ్‌స్క్రిప్షన్లలో 102 శాతం వృద్ధిని సాధించినట్లు వెల్లడించింది. నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం డిపార్చర్ టెర్మినల్‌లో ఎయిర్‌టెల్ తన రోమింగ్ కియోస్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

బ్యాటర్స్ రాణిస్తేనే...

7న భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య డబ్ల్యుటిసి ఫైనల్



లండన్: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) టైటిల్ దక్కాలంటే బ్యాటర్స్ రాణిస్తేనే అది సాధ్యం కానుంది. లండన్‌లోనికెన్సింగ్టన్ ఓవల్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగే ఫైనల్లో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 2021-23 టెస్ట్ సిరీస్ సైకిల్‌లో ఆస్ట్రేలియా 19టెస్టుల్లో 66.67పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. భారత్ 18మ్యాచుల్లో 58.8పాయింట్లతో రెండోస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాయి. ఇక భారతజట్టు డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరడం ఇది వరుసగా రెండోసారి. రెండేళ్ల క్రితం ఫైనల్లో భారతజట్టు న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలై ట్రోఫీని అందుకోలేకపోయింది. ఇక ఈ ఏడాది ప్రారంభంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా 4టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారతజట్టు మరోసారి ట్రోఫీని చేజార్చుకోకుండా ఉండాలంటే బ్యాటర్స్ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ విశ్లేషకులు అంటున్నారు. రోహిత్-స్టార్క్, స్మిత్-అశ్విన్‌తో పోల్చుతున్నారు. ఇక ఆస్ట్రేలియా జట్టు పాట్ కమ్మిన్స్, మిఛెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, నాథన్ లియాన్ వంటి బౌలర్లతో బలీయంగా ఉండగా.. భారతజట్టు జస్ప్రీత్ బుమ్రా దూరమైనా.. మహ్మద్ షమీ బౌలింగ్ భారాన్ని తన భుజాలపై మోయనున్నాడు.

అప్పటి పొరపాటును మళ్లీ చేయొద్దు: ఎంఎస్‌కె ప్రసాద్

వరుసగా రెండోసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు చేరిన భారత్ విజేతగా నిలవాలని తీవ్రంగా శ్రమిస్తోంది. జూన్ 7 నుంచి ఆస్ట్రేలియాతో తలపడేందుకు సిద్ధమవుతోంది. తుది జట్టు ఎంపికపై టీమిండియా మేనేజ్‌మెంట్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. బౌలింగ్ విభాగంపైనే కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ కీలక సూచనలు చేశాడు. గత ఫైనల్‌లో చేసిన పొరపాట్లను మరోసారి పునరావృతం చేయొద్దని పేర్కొన్నాడు. కివీస్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ పిచ్ పేస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ.. ఇద్దరు స్పిన్నర్లతో భారత్ బరిలోకి దిగింది. ఇలాంటి నిర్ణయమే టీమిండియా నష్టం చేసింది. ఇప్పుడు మరోసారి అలా కాకుండా ఉండాలంటే పిచ్ పరిస్థితికి అనుకూలంగా జట్టును ఎంపిక చేయాలని ఎంఎస్‌కె స్పష్టం చేశారు. అలాగే రిషభ్ పంత్ లేని లోటును తీర్చడం కష్టమేని చెప్పాడు. అలాగే గత ఫైనల్ మ్యాచ్‌కు మనం ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నాం. కానీ, వర్షం పడటంతో పిచ్ పరిస్థితి మారిపోయింది. అయినా సరే తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లకు స్థానం కల్పించి కివీస్‌తో మ్యాచ్ ఆడేశాం. కానీ, ఇప్పుడు మాత్రం ఆసీస్‌తో తలపడే ఓవల్ పిచ్ కండీషన్‌ను బట్టి తుది జట్టు ఎంపిక ఉండాలి. ఐదు రోజులపాటు ఎలా ఉంటుందో మనం అంచనా వేయలేం. అందుకే, ఒకే ప్లాన్‌కు ఫిక్స్ అయిపోకుండా ఉండాలి.

పోప్ డబుల్ సెంచరీ

ఇంగ్లండ్ 524/4డిక్లేర్డ్



పోప్ (205పరుగులు)

లండన్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్‌ను 172 పరుగులకే పరిమితం చేసిన ఇంగ్లండ్.. శుక్రవారం రెండోరోజు 4వికెట్ల నష్టానికి 524పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. క్రాలే(56), బెన్ డకెట్(182) వ్యక్తిగత స్కోర్లవద్ద ఔటవ్వగా.. పోప్(205) డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. పోప్- డకెట్ కలిసి 2వ వికెట్‌కు 252పరుగులు జతచేశారు. రూట్(52) అర్ధసెంచరీతో మెరిసాడు. మెక్‌బ్రిన్నేకు రెండు, హ్యూమే, హ్యాంక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఇంగ్లండ్‌కు 352పరుగుల ఆధిక్యత లభించింది.

ఐదు హామీలను అమలు చేయనున్న సిద్ధరామయ్య ప్రభుత్వం

బెంగళూరు : ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ఐదు హామీలను కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తేనుంది. ఎన్నికల హామీలపై శుక్రవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమాశంలో కేబినెట్ మంత్రులతో ఐదు హామీల అమలుపై చర్చించినట్లు సిఎం సిద్ధరామయ్య తెలిపారు. ఈ హామీలన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేయనున్నట్లు కర్ణాటక సిఎం వెల్లడించారు. ఉచిత విద్యుత్ పథకం (గృహ జ్యోతి) ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. 200 యూనిట్ల కంటే తక్కువ ఉంటే గృహ వినియోగదారులు బిల్లు కట్టాల్సిన పనిలేదు. గృహ జ్యోతి పథకం కింద 200 కంటే తక్కువ యూనిట్లు ఉంటే దాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ పథకం ఈ ఏడాది నుంచే అమల్లోకి రానున్నట్లు సిఎం సిద్ధరామయ్య ప్రకటించారు. ఇక ప్రతి కుటుంబంలోని మహిళా పెద్దలకు నెలకు రూ. 2000 చెల్లించనున్నట్లు కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అయితే బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి రావడం, ఆధార్ లింక్ చేయడంలో సాంకేతిక సమస్యల కారణంగా ప్రతి ఇంట్లో మహిళా పెద్ద ఎవరనేది ప్రభుత్వం నిర్ధారించేందుకు వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియ జూన్ 15 నుండి జులై 15 వరకు జరుగుతుంది. ఈ పథకం కింద మహిళలకు అందించే డబ్బును ఆగస్టు 15 లోగా చెల్లించనున్నట్లు సిద్ధరామయ్య వెల్లడించారు.

అణు నియంత్రణపై రష్యాతో చర్చలకు సిద్ధం : అమెరికా

వాషింగ్టన్ : ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా అణ్వాయుధాల నియంత్రణపై రష్యాతో చర్చలు జరిపేందుకు అమెరికా సిద్ధంగా వుంది. ఇరు దేశాల మధ్య గల చిట్ట చివరి అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాన్ని రద్దు చేయాలన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్ణయానికి ప్రతిగా చర్యలు తీసుకుంటూనే భవిష్యత్ అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం కోసం చర్చలకు కూడా సిద్ధంగా వున్నట్లు తెలిపింది. ఆయుధ నియంత్రణ సమాఖ్యనుద్దేశించి చేసే ప్రసంగంలో వైట్‌హౌస్ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ ఈ విషయాన్ని స్పష్టం చేయనున్నారు. కొత్త స్టార్ట్ ఒప్పంద నిబంధనలతో రష్యా సహకరించబోదని ఫిబ్రవరిలో పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్ విషయంలో అమెరికా, రష్యాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఈ ప్రకటన వెలువడింది. అయితే అణ్వాయుధాలపై ఒప్పంద పరిమితులను తాము గౌరవిస్తామని రష్యా తెలిపింది. 2026తో ఒప్పందం గడువు ముగుస్తున్నందున కొత్త ఒప్పంద చట్రపరిధిపై చర్చలకు అమెరికా సిద్ధంగా వుందన్న విషయాన్ని సలివాన్ తెలియచేస్తారు.

అమెరికా కవ్వింపు చర్యలే కారణం !

- చైనా విమర్శ

బీజింగ్ : దక్షిణ చైనా సముద్రంలో బుధవారం నాటి ఘటనకు అమెరికా కవ్వింపు చర్యలే కారణమని చైనా విమర్శించింది. గత వారం దక్షిణ చైనా సముద్ర జలాల్లో అమెరికా నిఘా విమానాన్ని దాటుకుంటూ చైనా విమానం వెళ్ళింది. తైవాన్‌తో సహా పలు అంశాలపై చైనా, అమెరికాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. చైనాపై నిశితంగా నిఘా పెట్టేందుకు అమెరికా తరచుగా నౌకలను, విమానాలను పంపుతుండడం, చైనా సార్వభౌమాధికారాన్ని, భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. ఈ తరహా కవ్వింపు చర్యలు, ప్రమాదకరమైన కార్యకలాపాలు సముద్ర జలాలపై భద్రతా సమస్యలకు కారణమవుతాయని అన్నారు. ఇటువంటి ప్రమాదకరమైన కవ్వింపు చర్యలను తక్షణమే ఆపాలని అమెరికాను మావో నింగ్ కోరారు. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలను చైనా తీసుకుంటుందని ఆమె చెప్పారు. గత వారం దక్షిణ చైనా సముద్ర జలాల్లో అమెరికా నిఘా విమానానికి సమీపంలో చైనా యుద్ధ విమాన పైలట్ అనవసరంగా దూకుడు రీతిలో వ్యవహరించారంటూ అమెరికా మిలటరీ మంగళవారం విమర్శించింది. అమెరికా విమానం ఆర్‌సి-135కి 400మీటర్ల దూరంలో చైనా విమానం ఎగిరిందని, దీనివల్ల అమెరికా విమానం కుదుపులకు లోనైందని ఇండో పసిఫిక్ కమాండ్ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే అమెరికా విమానం మిలటరీ శిక్షణా ప్రాంతాన్ని అధిగమించిందని చైనా మిలటరీ బుధవారం విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు లోబడే తమ విమానాన్ని పంపించామని చైనా మిలటరీ ప్రతినిధి ఝూంగ్ తెలిపారు.

తైవాన్‌తో వాణిజ్య ఒప్పందాలు వద్దు

- అమెరికాకు చైనా సూచన

బీజింగ్ : తైవాన్‌తో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయాలన్న అమెరికా ఆలోచనలను చైనా ప్రభుత్వం తీవ్రంగా విమర్శించింది. తైవాన్‌తో అధికారిక ఒప్పందాలకు దూరంగా వుండాలంటూ గురువారం అమెరికాను కోరింది. తైవాన్ హోదాపై ఒప్పందాలను అమెరికా ఉల్లంఘిస్తోందంటూ చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. తైవాన్‌తో అమెరికాకు ఇప్పటివరకు అధికారిక సంబంధాలు లేకపోయినా కోట్లాది డాలర్ల వార్షిక వాణిజ్యం ఇరు దేశాల మధ్య జరుగుతోంది, పైగా తైవాన్‌తో అసంఘటిత రూపంలో విస్తృత సంబంధాలను కలిగి వుంది. "తైవాన్‌తో అధికారిక మార్పిడులను అమెరికా ఆపాలి, చర్చలతో కూడిన ఒప్పందాలకు దూరంగా వుండాలి, తైవాన్ వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాలను పంపకూడదు." అని విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ కోరారు.

సంపద పెంచుదాం... ప్రజలకు పంచుదాం!

- తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సంపద పెంచుదాం... ప్రజలకు పంచుదాం... నినాదంతో పనిచేస్తూ తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. కొత్త రాష్ట్రమైనా పదేళ్లలోనే దేశంలో బలీయమైన శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం భద్రతా బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు జరిగిన పరిణామాలను గుర్తు చేశారు. 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన చర్యలను వివరించారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించే చారిత్రక పాత్ర తనకు లభించడంతో జీవితం ధన్యమైందన్నారు. 'శాంతియుత పంథాలో వివేకమే పునాదిగా వ్యూహాత్మకంగా సాగిన మలిదశ ఉద్యమంలోకి క్రమంగా అన్ని వర్గాలూ వచ్చి చేరాయి. ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, కార్మికులు, మహిళలు.... ఇలా అన్ని వర్గాల ప్రజలూ విభేదాలకు తావివ్వకుండా ఏకోన్ముఖులై ముందుకు



ప్రసంగిస్తున్న కెసిఆర్

కదిలారు. వారందరికీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తలవంచి నమస్కరిస్తున్నా. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టిఆర్ఎస్ ప్రభుత్వం అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనసా, వాచా, కర్మణా అంకితమైంది. ప్రతి రంగంలోనూ యావద్దేశం నివ్వెరపోయేలా ఫలితాలను సాధిస్తూ తెలంగాణ ప్రగతిపథంలో పరుగులు పెడుతోంది. కలలో కూడా ఎవరూ ఊహించని విధంగా పథకాలను తీసుకొచ్చాం. రాష్ట్ర పథకాల పట్ల దేశమంతటా ఆదరణ కనిపిస్తోంది. సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ యుగాన్ని ఆవిష్కరించింది. దశాబ్ది వేడుకల వేళ పోడు భూములకు పట్టాలు ఇస్తాం. పోడు భూములకూ రైతుబంధు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణ రైతుబంధు పథకం... కేంద్ర పాలకుల కళ్లు తెరిపించింది' అని సిఎం పేర్కొన్నారు. ఈ పదేళ్ల కాలం సాగునీటి రంగానికి స్వర్ణయుగమని కెసిఆర్ అన్నారు. పాత ప్రాజెక్టులను ఆధునీకరించామని, సమైక్య రాష్ట్రంలో మూలనపడిన ప్రాజెక్టులను పూర్తి చేశామని తెలిపారు. 1.25 కోట్ల ఎకరాలకు సాగునీటి స్వప్నం త్వరలోనే సాకారం కానుందని ప్రకటించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి... రాష్ట్ర రూపురేఖలనే మార్చేశాయన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని చూసి ప్రపంచమే ఆశ్చర్యపోతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బోధనలే శిరోధార్యంగా భావించిన తెలంగాణ ప్రభుత్వం... దళితులు స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలనే ఉద్దేశంతో 'దళితబంధు' అనే విప్లవాత్మక పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ప్రతి దళిత కుటుంబానికీ రూ.10 లక్షలను వంద శాతం గ్రాంట్‌గా అందిస్తోందని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 50 వేల మంది లబ్ధిదారులకు రూ.5 వేల కోట్లు అందజేశామన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించామని తెలిపారు. రెండో విడతలో 1.30 లక్షల మందికి దళితబంధు అందించనున్నామని వివరించారు. 21 రోజులపాటు గ్రామం నుంచి రాజధాని వరకు ప్రజలంతా ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొనాలని కెసిఆర్ కోరారు. కార్యక్రమంలో సిఎస్ శాంతికుమారి, డిజిపి అంజనీకుమార్, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్ అరెస్టుకు 9 వరకూ గడువు

- లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని రైతు నేతలు హెచ్చరిక
- రెజ్లర్లకు 1983 క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన జట్టు మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను అరెస్టు చేసేందుకు జూన్ 9 గడువు వరకు రైతు నేతలు గడువు విధించారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం హర్యానా, పంజాబ్, రాజస్థాన్ మరియు ఉత్తరప్రదేశ్ సహా వివిధ ప్రాంతాల నుండి వివిధ ఖాప్‌లు, రైతుల సంఘాల ప్రతినిధులు హర్యానాలోని కురుక్షేత్రలో జాట్ ధర్మశాలలో సమావేశం అయ్యారు. మైనర్‌తో సహా మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించిన రెజ్లర్‌లకు సంఘీభావం తెలుపుతూ రైతు సంఘాలు ఉత్తరప్రదేశ్‌లో "ఖాప్ మహాపంచాయత్" పంజాబ్, హర్యానాలో వరుసగా నిరసనలు జరిగాయి.

రైతు నేత రాకేష్ టికాయిత్ మాట్లాడుతూ "ఈ అంశంపై చర్చను ప్రారంభించడానికి మేము ప్రభుత్వానికి జూన్ 9 వరకు సమయం ఇస్తున్నాము. జూన్ 9 తరువాత, ఈ కుమార్తెలకు (మహిళా రెజ్లర్లు) మద్దతుగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, పంచాయితీలు నిర్వహిస్తాం"అని అన్నారు. "వారి (మల్లయోధుల) కుటుంబాలకు బెదిరింపులు వస్తున్నాయి. కాబట్టి వారికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని, లేదంటే నిరసనలు ఎదుర్కోవాలని కేంద్రాన్ని హెచ్చరించారు.

రెజ్లర్లకు 1983 క్రికెట్ ప్రపంచ కప్ విజేత జట్టు

1983 క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన జట్టు నిరసనకారులకు మద్దతు ఇస్తుందని, వారి మనోవేదనలను తప్పనిసరిగా పరిష్కరించాలని పేర్కొంది. నిరసన తెలిపిన మల్లయోధులపైచర్య హృదయ విదారకమైనది. భయంకరమైనది' అని పేర్కొంది. 1983 క్రికెట్ ప్రపంచ కప్ విజేత జట్టులో భాగమైన శ్రీకాంత్ మల్లయోధులు భౌతిక దాడి చేయబడిన దృశ్యాలను చూడటం 'హృదయ విదారకంగా, భయంకరంగా ఉంది" అని అన్నారు.

రెజ్లర్లకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలి: మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్

మాజీ భారత క్రికెటర్ కీర్తి ఆజాద్ నిరసన తెలిపిన రెజ్లర్లకు మద్దతుగా నిలిచారు. తమ క్రీడా విజయాలతో దేశానికి గౌరవం తెచ్చిన రెజ్లర్లకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగడం దారుణమని అన్నారు.

బ్రిజ్ భూషణ్‌కు షాక్

లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటోన్న బ్రిజ్ భూషణ్ కు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం షాకిచ్చింది. ఆయన సోమవారం అయోధ్యలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీ వాయిదా పడింది. తనకున్న మద్దతును చూపించుకునేందుకు ఈ ర్యాలీని నిర్వహించాలనుకున్నారు. కాగా, వాయిదా విషయాన్ని బ్రిజ్ భూషణ్ ఫేస్‌బుక్ ప్రకటన ద్వారా వెల్లడించారు. జూన్ 5న సాధువుల ఆశీస్సులతో 'జన చేతన్ మహార్యాలీ'ని నిర్వహించాలనుకున్నాను. అయితే ప్రస్తుతం నాపై నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ కొన్ని రోజుల పాటు దీనిని వాయిదా వేస్తున్నాను అని అన్నారు. అయితే ర్యాలీకి యుపి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని, అందుకే వాయిదా వేసినట్లు సమాచారం.



అటవీ సవరణ బిల్లుపై మద్రాసు హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, 2023పై సూచనలు, సలహాలను ఇంగ్లీషు లేదా హిందీల్లో పంపించాలని కోరుతూ కేంద్రం జారీ చేసిన పత్రికా ప్రకటనను నిలుపు చేయాలంటూ మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీం కోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. ఈ కేసులో పిటిషనర్ అభ్యంతరాలకు వీలు కల్పిస్తూ జూన్ 5కల్లా బిల్లు తమిళ వర్షన్‌ను లోక్‌సభ సచివాలయం ప్రచురిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హామీ ఇవ్వడాన్ని పరిగణనలోకి తీసుకున్న అనంతరం జస్టిస్ దీపంకర్ దత్తా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన బెంచ్, స్టే ఉత్తర్వులు మంజూరు చేసింది. పై విషయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం హైకోర్టు ఆదేశాలపై స్టే జారీ చేస్తున్నట్లు బెంచ్ పేర్కొంది. చట్టపరమైన ప్రక్రియలో హైకోర్టు జోక్యం చేసుకోరాదని మెహతా పేర్కొన్నారు. గత నెల 24 న్యాయవాది తీరన్ తిరుమురుగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ హైకోర్టు, కేంద్రం జారీ చేసిన పత్రికా ప్రకటనపై, తదుపరి అన్ని కార్యకలాపాలపై తాత్కాలికంగా స్టే విధించింది. ఇంగ్లీషు, హిందీల్లో కాకుండా ప్రాంతీయ భాషల్లో పత్రికా ప్రకటన అందుబాటులో లేకపోతే సూచనలు జారీ చేయాలంటూ ప్రజలను కోరిన ప్రయోజనం నెరవేరదని హైకోర్టు పేర్కొంది. తమిళ కాపీని విడుదల చేయాలంటూ కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోరారు.

ఎన్నికల కసరత్తు

- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కీలక ఆదేశాలు జారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ మేరకు శుక్రవారం 5 రాష్ట్రాల (తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం)ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ రాష్ట్రాల్లో మూడేళ్లు దాటిన ప్రభుత్వ అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. కీలక స్థానాల్లో వున్న పోలీస్, రెవెన్యూ అధికారులను బదిలీ చేయాలని సూచించింది. ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వొద్దని సిఈసి ఆదేశించింది. జూలై 31 లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సూచించింది. స్థానికంగా పోటీ చేస్తున్న అభ్యర్థులతో అధికారులకు బంధుత్వాలు లేవని డిక్లరేషన్ తీసుకోవాలని.. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఉద్యోగులను ఎన్నికల విధులకు దూరంగా వుంచాలని ఈసి ఆదేశించింది. గతంలో ఈసీ చర్యలు తీసుకున్న వ్యక్తులను కూడా విధులకు దూరంగా వుంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనికి సం బంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.

22న అమెరికా కాంగ్రెస్‌లో మోడీ ప్రసంగం

వాషింగ్టన్ : ఈ నెల 22న అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగించనున్నారు. ఈ విషయాన్ని అమెరికన్ కాంగ్రెస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అధికార పర్యటన నిమిత్తం మోడీ ఈ నెల 22న అమెరికా వెళ్లనున్న సంగతి తెలిసిందే. " అమెరికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, అమెరికా సెనేట్‌ను ఉద్దేశిస్తూ జూన్ 22న ప్రసంగించేందుకు భారత ప్రధాని మోడీని ఆహ్వానించడాన్ని గౌరవంగా భావిస్తున్నాం" అని అమెరికన్ కాంగ్రెస్ తన ప్రకటనలో పేర్కొంది. దీనిపై దిగువ సభ స్పీకర్ కెవిన్ మెకార్థీ, సెనేట్ తరపు నేత చుక్ స్కుమెర్, సెనేట్ రిపబ్లికన్ నేత మిచ్ మెకోనెల్, హౌస్ డెమొక్రాటిక్ నేత హకీమ్ జఫ్రీస్ సంతకాలు చేశారు. అమెరికన్ కాంగ్రెస్ సంయుక్త సమావేశాల్లో మోడీ ప్రసంగించడం ఇది రెండోసారి. 2016లోనూ అమెరికన్ కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో మోడీ ప్రసంగించారు. తాజా మోడీ పర్యటన సందర్భంగా.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్‌లు డిన్నర్‌ను ఏర్పాటు చేయనున్నారు. సాంకేతికత, వాణిజ్యం, పరిశ్రమలు, రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాల గురించి ఈ పర్యటనలో ఇరు దేశాధినేతలూ చర్చించనున్నారు. దాంతోపాటు వివిధ రంగాల్లో బలమైన ద్వైపాక్షిక సహకారాన్ని కొనసాగించడంపైనా సమీక్షించనున్నారు. బైడెన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత 2021లో ప్రధాని మోడీ వైట్‌హౌస్‌లో ఆయన్ను కలిశారు. గత నెలలో ఆధునిక డిఫెన్స్, కంప్యూటింగ్ టెక్నాలజీతోపాటు జనరల్ ఎలక్ట్రిక్ జెట్ ఇంజిన్ తయారీకి సంబంధించి అవసరమైన సాంకేతికత అభివృద్ధికి ఇరు దేశాలూ కలిసి పనిచేస్తాయని సంయుక్తంగా ప్రకటించాయి.

బిజెపిని గద్దె దించుతాం : రాహుల్‌గాంధీ

వాషింగ్టన్ : వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల్లో బిజెపిని గద్దె దించుతామని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. భారత్‌లో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయని అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ప్రతిపక్ష కూటమి బిజెపిని ఓడిస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో విస్తృతంగా చర్చలు జరుపుతోందని అన్నారు. దేశంలోని అన్ని సంస్థలపై మోడీ ప్రభుత్వం నియంత్రణ ఉందని, మీడియాపైనా నిర్బంధం ఉందదని అన్నారు.

ఆర్‌బికెలను పటిష్టపరుస్తాం

మొదటి పేజీ తరువాయి

గుర్తించామన్నారు. ఒక్కో క్లస్టర్ స్థాయిలో ఒక్కో హార్వెస్టర్‌ను రూ.25 లక్షల వ్యయంతో కొనుగోలు చేసినట్టు తెలిపారు. గ్రూపులుగా ఏర్పడిన రైతులు కేవలం పది శాతం సొమ్ము చెల్లిస్తే 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, మిగిలిన 50 శాతం రుణంగా ఇవ్వనున్నారని వివరించారు. వచ్చే అక్టోబరులో ఏడు లక్షల మంది రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్లు, వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు అంజాద్ బాష, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజనీ, కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, నందిగామ సురేష్, లావు శ్రీకృష్ణదేవరాయలు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గాలులతో రాష్ట్రం నిప్పుల కొలిమి!

మొదటి పేజీ తరువాయి

నందిగామ, కాకినాడ, అనంతపురం, నెల్లూరుల్లో పలుచోట్ల 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతకుముందు వరకూ 38 లేదా 39 డిగ్రీలకే పరిమితమైన వేడి ఒక్కసారిగా పెరిగింది. వేడి గాలులు, ఎండ తాకిడితో జనం అల్లాడిపోయారు. జంగమేశ్వరపురంలో 44 డిగ్రీలు, బాపట్లలో 43.5, అమరావతిలో 42.7, నందిగామ, కావలిలో 42, గన్నవరం, కాకినాడలో 41.4, నెల్లూరులో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 2 నుంచి 4 రోజుల పాటు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం శుక్రవారం రాత్రి వెల్లడించడం చూస్తే ఎండ తీవ్రత పెరగనుందన్నది స్పష్టమవుతోంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో ఎక్కడా వర్షాలు నమోదు కాకపోవడం, ఉష్ణోగ్రతలు ఒకవైపు పెరగడంతో ప్రజానీకం రోడ్లపైకి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, వైఎస్ఆర్ జిల్లా, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలతోపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో కోరారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈదురుగాలులతో కురిసే అకాల వర్షాలతోపాటుగా పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే వారు, పశువులు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

13వరకు ఇమ్రాన్ ఖాన్‌కు బెయిల్ పొడిగింపు

లాహోర్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ శుక్రవారం యాంటీ టెర్రరిజం కోర్టు ముందు హాజరయ్యారు. లాహోర్‌లో మిలటరీ కమాండర్ నివాసంపై దాడి కేసుతో సహ మూడు కేసుల్లో ఆయనకు జూన్ 13వరకు ముందస్తు బెయిల్ లభించింది. తనకు తీవ్రమైన ప్రాణ హాని వుందని, బెదిరింపులు వస్తున్నాయంటూ చెప్పారు. పిటిఐ కార్యకర్త జిలే షా హత్య కేసులో కూడా బెయిల్ పొడిగించాల్సిందిగా ఇమ్రాన్ కోర్టును కోరారు. ఆ కేసులో 6వరకు బెయిల్ పొడిగించారు. జిన్నా హౌస్‌పై దాడికేసులో ఎందుకు దర్యాప్తుకు హాజరు కావడం లేదని న్యాయమూర్తి ఇజియాస్ అహ్మద్ బటర్ ప్రశ్నించగా, తాను తీవ్రమైన బెదిరింపులను ఎదుర్కొంటున్నానని ఖాన్ చెప్పారు. వీడియో ద్వారా తాను దర్యాప్తుకు హాజరవుతానని అభ్యర్థించారు కానీ అందుకు కోర్టు తిరస్కరించిందని కోర్టు అధికారి తెలిపారు. దర్యాప్తులో పాల్గొనాల్సిందేనని ఆదేశించారు.

'రాజద్రోహం' కొనసాగాల్సిందే

- శిక్ష కూడా పెంచాల్సిందే..
- లా కమిషన్ రిపోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజద్రోహాన్ని నేరంగా పరిగణించడం కొనసాగించాలని, అంతేకాకుండా శిక్షా కాలాన్ని మూడేళ్ల నుంచి ఏడేళ్లకు పెంచాలని, అయితే కొన్ని సవరణలు అవసరమని లా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపిసి)లోని సెక్షన్ 124ఏను కొన్ని సవరణలతో కొనసాగించాలని తెలిపింది. కర్ణాటక హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రితు రాజ్ అవస్థి నేతృత్వంలోని కమిషన్ ఈ సిఫారసు చేసింది.

రాజద్రోహాన్ని నేరంగా పరిగణించే ఐపిసి సెక్షన్ 124ఏను కొన్ని సవరణలతో కొనసాగించాలని, ఈ సెక్షన్ క్రింద నేరస్థులకు మూడేళ్ల జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించాలని ప్రస్తుత నిబంధనలు చెప్తున్నాయని, మూడేళ్ల శిక్షను ఏడేళ్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి 22వ లా కమిషన్ సిఫారసు చేసింది. రాజద్రోహం అనేది వలస పాలకుల నుంచి వచ్చిన చట్టమని చెప్పడం దానిని రద్దు చేయడానికి తగిన కారణం కాదని పేర్కొంది. రాజద్రోహాన్ని నేరంగా పరిగణించే నిబంధనలు బ్రిటిష్ పాలనా కాలంలో వచ్చాయని, భారత దేశ స్వాతంత్ర్య సమర యోధులపై ఈ చట్టాన్ని ప్రయోగించారని చెప్తూ, దీనిని రద్దు చేయాలని కోరడం సరికాదని, దీనిని రద్దు చేయడానికి అవి సరైన కారణాలు కాదని అంది. సెక్షన్ 124ఏ దుర్వినియోగమవుతోందనే అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ రితు రాజ్ అవస్థి న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు రాసిన కవరింగ్ లెటర్‌లో తెలిపారు. రాజద్రోహం నిబంధన దుర్వినియోగం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేర శిక్షా స్మృతి (సిఆర్‌పిసి) సెక్షన్ 196(3)కి సారూప్యమైన నిబంధనను సిఆర్‌పిసి సెక్షన్ 154లో చేర్చాలని సిఫారసు చేశారు. ఐపిసి సెక్షన్ 124ఏ క్రింద నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ దాఖలుకు ముందు అవసరమైన విధానపరమైన రక్షణ కోసం ఇటువంటి నిబంధనను చేర్చాలని తెలిపారు. ఐపిసి సెక్షన్ 124ఏ చాలా విస్తృతమైనదని, దీని పరిధిలోకి వచ్చే నేరాలు ఇతర చట్టాల పరిధిలోకి రావని తెలిపింది. ఉదాహరణకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ), జాతీయ భద్రతా చట్టం వంటి చట్టాల ద్వారా ఐపిసి సెక్షన్ 124ఏ క్రిందకు వచ్చే నేరాలపై విచారణ చేయడం సాధ్యం కాదని తెలిపింది.

ఉలుకూ.. పలుకూ లేదు

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై ప్రధాని మౌనం దేనికి సంకేతం?

న్యూఢిల్లీ : లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోని పక్షంలో తమ పతకాలను గంగానదిలో విసిరేస్తామని మహిళా మల్లయోధులు హెచ్చరించినా, పోలీసుల దాష్టీకాన్ని నిరసిస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని అల్టిమేటం ఇచ్చినా ప్రధాని మోడీ మాత్రం ఉలకడం లేదు...పలకడం లేదు. కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ కూడా పెదవి విప్పడం లేదు. ప్రభుత్వం తరపున ఇప్పటి వరకూ ఎవరూ వారితో సంప్రదింపులు జరిపిన దాఖలాలు సైతం లేవు. పైగా జంతర్‌మంతర్ వద్ద ఇకపై ప్రదర్శనలు జరపవద్దని, వేరే వేదికను చూసుకోవాలని పోలీసులు హుకుం జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాతే వారు బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు రెజ్లర్ల నిరసనపై పోలీసుల జులుంను అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం తీవ్రంగా ఖండించింది.

ప్రజాస్వామ్యం, మహిళా హక్కుల గురించి సుద్దులు చెప్పే ప్రధాని దేశానికి ఖ్యాతిని ఆర్జించి పెట్టిన మహిళా రెజ్లర్లపై తన పార్టీ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినా, పోలీసులు అమానుషంగా ప్రవర్తించినా కనీసం స్పందించకపోవడం దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మోడీ భయపడిన ప్రతిసారీ పోలీసులను మోహరిస్తారని వారు ఎద్దేవా చేస్తున్నారు. మహిళల భద్రత, గౌరవం గురించి ప్రవచనాలు చెప్పడం మోడీకి కొత్తేమీ కాదు. అయితే ఆయన మాటలకు, చేతలకు పొంతనే ఉండదు. గత సంవత్సరం స్వాతంత్ర్యదినోత్సవం రోజున ఎర్రకోట నుండి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మహిళలను అవమానించబోమని ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. కానీ అదే రోజు గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం ఓ ఘనకార్యం చేసింది. బిల్కిస్ బానో, ఆమె కుటుంబసభ్యులపై అమానుష చర్యలకు పాల్పడిన నేరంపై జీవితఖైదు విధించబడిన 11 మందిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జైలు నుండి విడుదలైన వారిని హీరోలుగా కీర్తిస్తూ ఘనస్వాగతం పలికి, మిఠాయిలు పంచారు. ఇంత దారుణం జరుగుతున్నా ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పైగా కొందరు బీజేపీ నేతలు ఈ చర్యను నిస్సిగ్గుగా సమర్ధించుకున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది.

బేటీ బచావ్ బేటీ పఢావ్ అని నినదించే మోడీ ప్రభుత్వం మహిళలకు ఏ మాత్రం భద్రత, రక్షణ కల్పిస్తున్నదో రెజ్లర్ల ఆందోళన తేటతెల్లం చేస్తోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, మహిళా రెజ్లర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సెలవిచ్చారు. న్యాయం లభించే వరకూ సహనంతో వేచి ఉండాలంటూ ఉచిత సలహా కూడా ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ మాత్రం పోస్కో చట్టం దుర్వినియోగం అవుతోందని గగ్గోలు పెట్టారు. దానిని సవరించాలని సూచించారు. నేరస్తులకు బెయిల్ నిరాకరించే చట్ట నిబంధనను తొలగించాలని ఆయన కోరుతున్నారు. నిందితులకు బెయిల్ ఇస్తే లైంగిక వేధింపులకు గురైన బాధితులకు ఏ విధంగా రక్షణ లభిస్తుంది? పైగా నిందితులు దానిని దుర్వినియోగం చేసి పదేపదే నేరాలకు పాల్పడే ప్రమాదం కూడా ఉంటుంది.

మోడీ మౌనం, చట్టం తన పని తాను చేసుకుపోతుందంటూ ఠాకూర్ చెబుతున్న మాటలు, పోస్కో చట్టాన్ని సవరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని బ్రిజ్ భూషణ్ చేసిన ప్రకటనను గమనిస్తే మహిళా రెజ్లర్ల ఆందోళన విషయంలో మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని అర్థమవుతోంది.

అయితే రెజ్లర్లకు అనూహ్యంగా కొందరు బీజేపీ నేతల నుంచి మద్దతు లభిస్తోంది. రెజ్లర్ల ఆరోపణలను పార్టీ తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ ప్రీతమ్ ముండే కోరారు. హర్యానాకు చెందిన బీజేపీ నేతలు కూడా కేంద్ర ప్రభుత్వ మౌనాన్ని ప్రశ్నిస్తున్నారు. కాగా అయోధ్యలో తనకు మద్దతుగా ఈ నెల ఐదున భారీ ర్యాలీ నిర్వహించాలని బ్రిజ్ భూషణ్ యోచిస్తుండగా అందుకు అధికారులు అనుమతి నిరాకరించారు.

ఇదీ రెజ్లింగ్ కీచకుడి బాగోతం

మొదటి పేజీ తరువాయి

అవవద్దని తాను బ్రిజ్‌భూషణ్‌ను స్పష్టంగా కోరానని చెప్పింది. తన భుజాలు, మోకాళ్లు, అరచేతులను సింగ్ అనుచితంగా ముట్టుకున్నారని ఓ రెజ్లర్ ఆరోపించారు. ఓరోజు ఆయన నన్ను పిలిచి టీషర్ట్ లాగారని, తన శ్వాస తీరును తెలుసుకునే నెపంతో తన ఛాతీని, పొట్టను అనుచితంగా ముట్టుకున్నట్లు తెలిపారు. ఓసారి నాకు తెలియని ఓ పదార్థాన్ని తీసుకొచ్చి తినమని చెప్పారని మరో ఫిర్యాదుదారు ఆరోపించారు. తనను ఆయన వైపునకు బలవంతంగా లాక్కున్నారని ఆరోపించారు. తనను కౌగిలించుకుని, తనకు లంచం ఇవ్వజూపారని మరో రెజ్లర్ ఆరోపించారు. తాను వరుసలో నిల్చున్నపుడు తనను అనుచితంగా ముట్టుకున్నారని మరో రెజ్లర్ ఆరోపించారు. దానివల్ల ఫిట్‌గా ఉంటావని, ప్రదర్శన బాగా చేయొచ్చని చెప్పేవారు" అని మరో బాధితురాలు ఆరోపించింది. కోచ్ లేని సమయంలో తమ వద్దకు వచ్చి ఇలాగే అభ్యంతరకరంగా ప్రవర్తించేవారని అవార్డు గెలుచుకున్న ఓ రెజ్లర్ ఆరోపణలు చేశారు.

బ్రిజ్ భూషణ్ తమతో అత్యంత అనుచితమైన, దారుణమైన రీతిలో బెదిరింపులు, లైంగిక అనుచితమైన, దారుణమైన రీతిలో బెదిరింపులు, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రెజ్లర్లు పేర్కొన్నారు. "ఆయనకు భయపడి మహిళా అథ్లెట్లు ఎప్పుడు తమ గదుల్లో నుంచి బయటకు వచ్చినా బృందాలుగానే ఉండేవారని, అయినప్పటికీ.. ఆయన మా బృందంలో నుంచి ఒకరిని వేరుగా తీసుకెళ్లి అభ్యంతరకర ప్రశ్నలు అడిగేవారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయేవాళ్లం" అని ఓ బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

"విదేశాల్లో జరిగిన పోటీల్లో నేను గాయపడ్డాను. అప్పుడు ఆయన (బ్రిజ్ భూషణ్) నా వద్దకు వచ్చి.. తనతో సాన్నిహిత్యంగా ఉంటే ట్రీట్మెంట్ ఖర్చులన్నీ ఫెడరేషనే భరిస్తుందని చెప్పారు" అని మరో బాధితురాలు తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేసింది. ఫొటో తీసుకుందామంటూ తనను బలవంతంగా గట్టిగా హగ్ చేసుకున్నారని మరో రెజ్లర్ ఆరోపించింది.


ఇక, రెజ్లింగ్ సమాఖ్య సెక్రటరీ వినోద్ తోమర్ పైన ఓ రెజ్లర్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఓ సారి తాను ఢిల్లీలోని డబ్ల్యుఎఫ్ఎస్ఐ కార్యాలయానికి వెళ్లినప్పుడు.. తోమర్ తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. గదిలో అందర్నీ బయటకు పంపించి, తనను బలవంతంగా ఆయనవైపు లాక్కొన్నారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై త్వరలోనే తుది నివేదికను కోర్టులో సమర్పించేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధమయ్యారు.

రుణ పరిమితి బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం

- ద్రవ్యోల్బణానికి, సైనిక వ్యయానికి రెక్కలు
- సామాజిక భద్రతకు నిధుల కోత తప్పదన్న నిపుణులు

వాషింగ్టన్: ఆర్థిక దివాలాను నివారించేందుకు అధ్యక్షుడు బైడెన్‌కు, అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధుల సభ స్పీకర్ మెక్ కార్థీకి మధ్య కుదిరిన రాజీ మేరకు ఈ బిల్లును గురువారం అమెరికన్ కాంగ్రెస్ 63-36 ఓట్ల తేడాతో ఆమోదించింది. దీంతో ఇప్పటివరకు 31.4 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న ప్రభుత్వ రుణ పరిమితిని ఎత్తివేశారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ విధంగా రుణ పరిమితిని అమెరికన్ కాంగ్రెస్ సడలించడం ఇది 103వ సారి.ప్రస్తుతం ఉన్న రుణపరిమితి 31.4 లక్షల కోట్ల డాలర్లు అమెరికన్ జిడిపి కన్నా 120 శాతం అధికం. అంటే ఒక్కో అమెరికా పౌరుడి నెత్తిపైన 90,000 డాలర్లు అప్పు ఉందన్నమాట. ఇప్పుడు ఆ పరిమితి లేదు. ప్రభుత్వం ఎంతైనా రుణాలు చేయొచ్చు. రుణ పరిమితి పెంపునకు అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపడాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు , అమెరికన్ ప్రజలకు లభించిన గొప్ప విజయంగా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు. నిజానికి ఇది సామాజిక వ్యయంపై బడ్జెట్‌లో మరిన్ని కోతలు పెట్టడానికి, సైనిక వ్యయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచడమే ఈ రుణ పరిమితి పెంపు వెనక ఉద్దేశమని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానించారు.

ఫ్యాషన్



- కె. రాజేశ్వరి
8వ తరగతి,
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల
మహానంది (మం),
నంద్యాల జిల్లా.

బొమ్మరిల్లు





ఎల్ అనీశ్వర్ రెడ్డి,
2వ తరగతి ,
సిద్ధారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల,
చాపాడు మండలం.



- ప్రియనందన,
6వ తరగతి,
శ్రీ సత్యసాయి
విద్యావిహార్,
విశాఖపట్నం.





- వి. ర్యాన్ రోస్
2వ తరగతి,
సెయింట్ జేవియర్స్ స్కూలు
ముద్దనూరు,
కడప జిల్లా.



చిచ్చర పిడుగు అంటున్నారు



హాయ్ సిస్టర్స్ అండ్ బ్రదర్స్!

నా పేరు జ్ఞానవర్ధన్. నా వయస్సు 22 నెలలు. సాధారణంగా ఈ వయస్సులో సరిగ్గా మాటలు కూడా రావు. కాని నాకు మాటలు బాగా వస్తాయి. మా అమ్మ సహకారంతో విజ్ఞానాన్ని పొంది ఎందరినో అబ్బురపరుస్తూ ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నా. దాంతో నన్ను అందరూ మెచ్చుకుని అవార్డులు ఇస్తున్నారు. నన్ను చూసి చిచ్చర పిడుగు, బాల మేధావి అంటూ బిరుదులు ఇస్తున్నారు.

మా అమ్మానాన్న దామర్ల ద్రాక్షసాయి, నీలిమ. మేము మంగళగిరి రాజీవ్ గృహకల్ప సమీపంలో సంగారెడ్డి పట్టణం, రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాం. నాన్నా టాటా సంస్థలో పనిచేస్తున్నారు. మా అమ్మ గతంలో ఉద్యోగం చేసేది. నేను పుట్టాక నన్ను చూసుకుంటూ ఇంట్లోనే ఉంటున్నారు. చిన్నప్పటి నుంచి నాలో తెలివితేటలను గమనించిన అమ్మానాన్నలు నా సృజనాత్మకతను పెంపొందించేందుకు విజ్ఞానదాయకమైన విషయాలను చెబుతూ ఉండేవారు. దీంతో జ్ఞానవర్ధన్ పేరుకు తగ్గట్టుగా మా అమ్మ చెప్పిన విషయాలను జ్ఞాపకం ఉంచుకుని తిరిగి అడిగినప్పుడు సమాధానం చెప్పేవాడిని. 21 దేశాలకు సంబంధించిన జాతీయ జెండాలను చూపితే వెంటనే ఆ దేశం పేరు, రాజధానులు సైతం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచా. 30 మంది శాస్త్రవేత్తలను గుర్తించడమే కాకుండా వారు ఏమి కనుక్కొన్నారో చెబుతున్నా. దేశంలోని రాష్ట్రాల పేర్లు, రాజధానులను చెప్పి, చుట్టుపక్కల జనాలను, అధికారులను ఆకట్టుకున్నా. 30 మంది స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలు చూపిస్తే వారి పేర్లు చెప్పేస్తా. 30 రకాల పూలు, 50 జంతువులు, 20 పక్షులు, 30 వాహనాలు, 20 వృత్తులను గుర్తించి వాటి పేర్లు చెబుతున్నా. దీంతోపాటు తెలుగు, ఆంగ్ల అక్షరాలను చదవడం నేర్చుకున్నా.


దీంతో అతిచిన్న వయసులో ప్రతిభ చూపుతున్నాడంటూ మీడియా అంకుల్స్, ఆంటీస్ నా దగ్గరకు వస్తున్నారు. అలా... అలా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకున్నా. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా వండర్ కిడ్‌గా ప్రశంసలూ అందుకున్నా.

- దామర్ల జ్ఞానవర్ధన్,
మంగళగిరి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీకోసం

పళ్లు శుభ్రంగా, తెల్లగా ఉండాలంటే వారానికోసారి ఉప్పుతో గాని, బేకింగ్ పౌడర్‌తో గాని తోముకోవాలి.



జీవన సౌరభం

తాము చేసే పొరపాట్ల నుంచే కాదు, ఇతరుల వైఫల్యాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవడం వివేకవంతుల లక్షణం.

ఆమె జీవితం.. ఎన్నో ముళ్ల కంచెలు ...



కేరళలో ఓ సినిమా షూటింగు జరుగుతోంది. హీరోయిన్ కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా ఓ వృద్ధమహిళ పనిచేస్తున్నారు. అది ఆమె తొలి సినిమా. డైరెక్టర్‌తో ఉన్న చిరకాల పరిచయం కారణంగా ఆమెకు ఈ అవకాశం వచ్చింది. అలా 69 ఏళ్ల వయసులో కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారిన ఆమె పేరు నళినీ జమీల. మొదటి సినిమాకే రాష్ట్ర జ్యూరీ అవార్డు అందుకున్న ఆమె అంతకు ముందే అంటే 15 ఏళ్ల క్రితమే తన ఆటోబయోగ్రఫీ రచించి తొలిసారి వార్తల్లో నిలిచారు. అప్పట్లో అదో పెద్ద సెన్సేషన్. పితృస్వామ్య సమాజం ఆ పుస్తకాన్ని బహిష్కరించింది. ఆమె బరితెగించిన ఆడది అంది. కారణం.. ఆమె సెక్స్ వర్కర్. ఆ వృత్తిలో తన అనుభవాలు.. తనకెదురైన వ్యక్తుల గురించే పుస్తకాలు రచించి రచయితగా మారింది. ఆ పుస్తకాలు పలు భాషల్లో అనువాదమయ్యాయి కూడా. ఆమె ప్రయాణం అక్కడితో ఆగలేదు.. సామాజికవేత్తగా పలు కార్యక్రమాలు స్వీకరించింది. ఎయిడ్స్ అవగాహనకై దేశవిదేశాలు తిరిగింది. సెక్స్ వర్కర్ల జీవితాలతో రూపొందిన పలు డాక్యుమెంటరీల్లో నటించింది.

బతుకుదెరువు కోసం.. బలవంతంగా ...

మూడో తరగతికే చదువుకు స్వస్తి చెప్పిన నళినీకి చిన్న వయసులోనే వివాహమైంది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక క్యాన్సర్ వ్యాధితో భర్త చనిపోయాడు. పుట్టింటికి వెళ్లే దారి లేదు. తోడబుట్టిన అన్న తన కంటే పెద్దదైన ఆమెను పెళ్లి చేసుకుంటున్నాడని తెలిసి అతనికి మద్దతు ఇచ్చినందుకు ఇంటి నుండి గెంటివేయబడింది. తనకు తోడుగా ఉంటాడనుకున్న భర్త అర్ధంతరంగా వెళ్లిపోయాడు. పిల్లల పోషణ కోసం ఇటుకబట్టీల్లో పనిచేసింది. రోజుకు రెండున్నర రూపాయల కూలితో పిల్లలనెలా పోషిస్తావన్న అత్తింటి వేధింపులు భరించింది. ఈ పరిస్థితుల్లో పిల్లలను ఏదైనా అనాథాశ్రమంలోకి చేర్పించాలని చూసింది. కాని ఆమె స్నేహితురాలు ఆ ప్రయత్నాన్ని వారించి తనకు సాయం చేస్తానని చెప్పింది. మాయమాటలు చెప్పి సెక్స్ వర్క్‌లోకి దింపింది.



నాకు ఎప్పటికీ అర్థం కాదు..

'ఆ రోజు రాత్రంతా ఓ పోలీసుతో ఉన్న నన్ను తెల్లవారుజామున మరో పోలీసు అరెస్టు చేశాడు. సెక్స్ వర్క్ చేస్తున్నానని నిర్ధారణ అయ్యాక దారుణంగా హింసించారు. అరికాళ్ల మీద కొట్టారు. అంతటి బాధలోనూ నేను ఏడ్వలేదు. అది వారికి మరింత కోపం తెప్పించింది. నాకు ఇప్పటికీ అర్థం కాని విషయమేంటంటే.. ఆ రోజు తెల్లవారుజామున వీధిలో నడుస్తున్న నాపై ఓ పోలీసు చాలా దారుణంగా దాడి చేశాడు. నా రెండు చేతులు వెనక్కి గుంజి, గట్టిగా పట్టేసుకున్నాడు. విడిపించుకునే అవకాశమే ఇవ్వలేదు. నేను తప్పుచేశాను అన్న ఆ పోలీసు రాత్రంతా నాతో ఉన్న పోలీసును మాత్రం అరెస్టు చేయలేదు. విచిత్రమేమంటే.. నాతో ఉన్న పోలీసే వీధుల్లో తిరుగుతున్న సెక్స్‌వర్కర్లను వెంటనే పట్టుకుని స్టేషనుకు తీసుకురమ్మని చెప్పాడంట.. ఎంత దారుణం! ఏ పరిస్థితుల్లో ఈ కూపంలోకి వచ్చామో ఎవరికీ తెలియదు. ఫలానా పని చేస్తున్నామని చెప్పుకునేందుకు కూడా సిగ్గుపడతాం. దీన్నుండి బయటపడే దారుండదు. ధైర్యం చేసి వచ్చినా ఉండేందుకు ఎవరూ ఇల్లు ఇవ్వరు. సాయం చేసే వారు కనిపించరు. ఇంత దౌర్భాగ్య పరిస్థితుల్లో బతికిన నేను ఈ స్థితికి వచ్చినా ఇప్పటికీ ఏదో ఒక మూల ఓ అనుమానపు చూపు నాకు తగులుతూనే ఉంటుంది'.

రెండు పుస్తకాలే.. పెద్ద సంచలనం..

'నా జీవితంలో ఎదురైన మంచి, చెడు అనుభవాలతో రెండు పుస్తకాలు రాశాను. అయితే సాహిత్యలోకం నన్ను అంగీకరించలేదు. నా పుస్తకాలు చదవదగ్గవి కాదన్నారు. అలాంటివి రాయడమే పెద్ద తప్పన్నారు. 2015లో 'నా ఆటో బయోగ్రఫీ' పేరుతో తొలి పుస్తకం రాసిన నేను 2018లో వృత్తిలో నా అనుభవాలు చెబుతూ నాకు తారసపడిన వ్యక్తులు.. వారితో నాకు ఏర్పడిన అనుబంధం గురించి మరో పుస్తకం రచించాను. ఆ పుస్తకం పెద్ద సంచలనమైంది. అది చాలామందికి రుచించలేదు. నాపై నిందలు వేశారు. ఇవన్నీ నేను ఊహించినవే.. కాబట్టి భయపడలేదు. అవి నా ఒక్కదాని అనుభవాలే కావు.. నాలాంటి వారందరివీ' అంటారు ఆమె.

కాస్ట్యూమ్ డిజైనర్‌గా ...

దర్శకుడు మనీలాల్‌తో నాకు చిరకాల స్నేహం ఉంది. అతను తెరకెక్కిస్తోన్న 'భరతపూజ' చిత్రంలో హీరోయిన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా నన్ను తీసుకున్నాడు. ఆ పాత్ర ఓ వేశ్యది. ఆ పాత్రకు దుస్తులు డిజైన్ చేస్తున్నప్పుడు నా గతం గుర్తుచేసుకున్నాను. అప్పుడు నేను వాడిన బట్టలనే సెలక్ట్ చేశాను. అవి చాలా సాదాసీదావి. వేశ్యల బతుకులు చీకట్లో మగ్గుతాయనే అందరూ అనుకుంటారు. కానీ, మా బతుకులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తాయి. అవి తెలిసిన వారు చాలా తక్కువ. అందుకే ఆ పాత్రలో వారి స్థితి కనిపించాలనుకున్నాను. హంగు, ఆర్భాటం లేకుండా సహజంగా వాడే బట్టలనే కట్టించాను. అదే నాకు అవార్డు వచ్చేలా చేసింది. 2021లో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ అవార్డు రావడం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. నా జీవితంలో ఎదురైన అరుదైన అనుభవం ఇది. ఆ సినిమా తరువాత నాకు మరో అవకాశం రాలేదు. ఎందుకంటే నాలాంటి వారితో పనిచేయడం ఎవరికీ ఇష్టం ఉండదు' అంటున్న ఆమె 2001 నుండి కేరళ సెక్స్ వర్కర్ ఫోరమ్ కన్వీనర్‌గా ఉంటున్నారు. ప్రస్తుతం వృత్తి నుంచి బయటికి వచ్చి, యాచకం చేసుకుంటున్న వృద్ధ మహిళలకు వసతి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యం కోసం పనిచేస్తున్నారు.



యాక్షన్ సీన్స్ కంప్లీట్

బోయపాటి శ్రీను, ఎనర్జిటిక్ హీరో రామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'రాపో 20'. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. తాజాగా అభిమానుకు రామ్ అప్‌డేట్ అందించాడు. 'మొత్తానికి 24 రోజులపాటు కష్టపడి స్టన్నింగ్ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ పూర్తి చేశాం. ఇది క్లైమాక్స్ కాదు..' అంటూ ట్వీట్ చేశాడు రామ్. చిత్రాన్ని అక్టోబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. చిత్రాన్ని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ పతాకంపై పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

శ్రీకాంత్ అడ్డాల కొత్త ప్రాజెక్టు



దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తన కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. ద్వారక క్రియేషన్స్ పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మాణంలో ఈ సినిమా రాబోతోంది. ఈ సినిమాతో విరాట్ కర్ణ అనే మరో కొత్త హీరోని ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఈ సినిమాకు 'పెద కాపు' అనే టైటిల్.. 'ఓ సామాన్యుడి సంతకం' అనే ట్యాగ్ లైన్‌ను ఫిక్స్ చేశారు. అయితే ఈ సినిమాను రెండు భాగాలుగా ఆడియెన్స్ ముందుకు తీసుకురాబోతున్నాడు. అందుకే టైటిల్‌లో 'పెదకాపు 1' పెట్టారు. ఫస్ట్ టైం ఈ సినిమాతో ఊరమాస్ టచ్ ఇవ్వబోతున్నాడు. అయితే ఈ సినిమా టైటిల్ ఓ వర్గానికి చెందినదిగా ఉండడంతో సోషల్ మీడియాలో చర్చ ప్రారంభమైంది. మరి ఈ ప్రాజెక్టుతో ఎలా ముందుకు వెళ్లబోతున్నారో చూడాలి.



మెగా సాంగ్ ప్రోమో

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తమన్నా హీరోయిన్‌గా తాజాగా తెరకెక్కుతున్న మూవీ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీలో మెగాస్టార్‌కి చెల్లెలిగా కీర్తి సురేష్ నటిస్తుండగా ఈ మూవీని ఏకే ఎంటర్టైన్మెంట్స్, క్రియేటివ్ కమర్షియల్ సంస్థలు గ్రాండ్ లెవెల్లో నిర్మిస్తున్నాయి. తాజాగా మూవీ నుండి 'భోళా మేనియా..' అనే పల్లవితో సాగే మాస్ బీట్ సాంగ్ ప్రోమోని మేకర్స్ విడుదల చేసారు. సంగీతం వినిపించారు. ఫుల్ సాంగ్ ని జూన్ 4న విడుదల చేయనున్నారు. మణిశర్మ కుమారుడు మహతి స్వర సాగర్ సంగీతం అందించిన ఈ మూవీని ఆగష్టు 11న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

నాగచైతన్య - బన్నీవాస్ ప్రాజెక్టు తాజా కబురు



నాగచైతన్య, బన్నీవాసుతో చేయబోతున్న సినిమాపై తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. ఫిషరీస్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా ఉండబోతుందని బన్నీ వాసు తెలిపారు. ఇందులో చైతన్య ఫిషింగ్ బోటు డ్రైవర్‌గా కనిపించబోతున్నట్టు కూడా తెలియజేశారు. గుజరాత్‌లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది. సినిమా కోసం చాలా రీసెర్చ్ కొనసాగుతోందని, ఈ ప్రాజెక్ట్‌లో ట్విస్టులతో సాగే లవ్ డ్రామా ఉండబోతున్నట్టు కూడా చెప్పారు.

ప్రభుదేవా కొత్త చిత్రం ప్రారంభం



'కాదలన్' చిత్రంలో ప్రభుదేవా, వడివేలు నర్తించిన 'పెట్టరాప్' అనే పల్లవితో సాగే పాట చాలా పాపులర్ అయ్యింది. ఇప్పుడు అదే టైటిల్‌తో తెరకెక్కుతున్న చిత్రంలో ప్రభుదేవా కథానాయకుడిగా నటించనున్నారు. దీనికి 'పాట్టు అడి.. ఆట్టం.. రిపీట్' అనే ట్యాగ్‌ను పెట్టారు. ఇందులో వేదిక హీరోయిన్‌గా నటించనున్నారు. చాలా గ్యాప్ తరువాత ఈమె తమిళంలో నటిస్తున్న చిత్రమిది. వివేక్ ప్రసన్న, భగవతి పెరుమాళ్, రమేశ్ తిలక్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించనున్నారు. మలయాళ దర్శకుడు ఎస్‌జే.శీను ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని బ్లూహిల్స్ ఫిలింస్ పతాకంపై జోబీ పి.శ్యామ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం ప్రారంభమైంది. జూన్ 15వ తేదీ నుండి రెగ్యులర్ షూటింగ్ నిర్వహించనున్నారు.

స్టార్ డైరెక్టర్లను లైన్లో పెట్టిన అరవింద్



గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించనున్న పలు సినిమా ప్రాజెక్ట్‌లను నిర్మాత అల్లు అరవింద్ తాజాగా ప్రకటించారు. 2018 మలయాళ డబ్బింగ్ మూవీ ప్రమోషనల్ ఈవెంట్లో మాట్లాడుతూ... తమ బ్యానర్ నుండి రాబోయే ప్రాజెక్టుల కోసం డైరెక్టర్లు బోయపాటి శ్రీను, సురేందర్ రెడ్డి, కార్తికేయ దర్శకుడు చందూ మొండేటి సంతకం చేసినట్లు వెల్లడించారు. బోయపాటి ప్రాజెక్ట్ స్క్రిప్ట్ దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు స్టార్ హీరోలు పరిశీలనలో ఉన్నట్లు అరవింద్ తెలిపారు. ఇక సురేందర్ రెడ్డి స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నారని వెల్లడించారు. అలాగే చందూ మొండేటితో వరుసగా మూడు ప్రాజెక్టులు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు స్క్రిప్టులు పూర్తయ్యాయని అందులో ఒకటి దాదాపు రూ.300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతుందని చెప్పారు.

పెగూలా ఔట్..

అన్‌సీడెడ్ చేతిలో ఓడిన 3వ ర్యాంకర్
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో జెస్సికా పెగూలా ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీలో పెగూలా 1-6, 3-6తో బెల్జియంకు చెందిన ఎలీసే మెర్టెన్స్ చేతిలో ఓటమిపాలైంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో పెగూలా 3వ ర్యాంక్‌లో ఉండగా.. ఇటీవల రెండు డబ్ల్యుటిఏ టైటిల్స్‌ను కైవసం చేసుకుంది. ఇక పెగూలా నెగ్గిన ఎలీసే మెర్టెన్స్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

అల్కరాజ్ సునాయాసంగా..

పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన 2వ రౌండ్ పోటీలో అల్కరాజ్ 6-1, 3-6, 6-1, 6-2తో టోరో డానియేల్(జపాన్) పై వరుససెట్లలో నెగ్గాడు. మరో పోటీలో డానిస్ షపొవొలోవ్(రష్యా) 6-2, 3-6,న 6-3, 6-3తో మట్టో అమల్డి(ఇటలీ)పై, లారెంజో మసెట్టి(ఇటలీ) 6-1, 6-1, 6-2తో అలెగ్జాండర్(రష్యా)పై నెగ్గి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

సెమీస్‌కు లక్ష్యసేన్

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి యువ షట్లర్ లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-19, 21-11తో మలేషియాకు చెందిన జున్-యో-లియాంగ్‌పై వరుససెట్లలో గెలిచాడు. హామార్క్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలో తొలి గేమ్‌లో లక్ష్యసేన్ 10-16తో వెనుకబడ్డాడు. ఆ తర్వాత లక్ష్యసేన్ వరుసగా పాయింట్లు సాధించి ఆ గేమ్‌ను 21-19తో గెలుచుకున్న తీరు అద్భుతం. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో లక్ష్యసేన్ 9వ స్థానంలో ఉండగా.. జున్-హో-లియాంగ్ 65వ ర్యాంకర్. సెమీస్‌లో లక్ష్యసేన్ గ్వాంగ్-జు-లు(చైనా), విటిడ్‌శరణ్(థాయ్‌లాండ్) మ్యాచ్ విజేతతో తలపడనున్నాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో కిరణ్ జార్జి 16-21, 17-21తో ఫ్రాన్స్‌కు చెందిన జూనియర్ పొపొవ్ చేతిలో ఓడాడు. ఈ మ్యాచ్ కేవలం 41 నిమిషాల్లోనే ముగిసింది. కిరణ్ జార్జి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 59వ స్థానంలో ఉండగా.. జూనియర్ పొపొవ్ ర్యాంక్ 28. దీంతో ఈ టోర్నమెంట్‌లో మిగిలిన ఏకైక భారత షట్లర్ లక్ష్యసేన్ మాత్రమే.

ఆఫ్ఘనిస్తాన్ సంచలనం

తొలి వన్డేలో శ్రీలంకపై గెలుపు

కొలంబో: శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు సంచలన విజయం సాధించింది. మూడో వన్డేల సిరీస్‌లో భాగంగా మహింద్ర రాజపక్సా స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 6వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 268పరుగులకు ఆలౌట్ కాగా.. ఆఫ్ఘనిస్తాన్ జట్టు 46.5ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జద్రాన్(98) తృటిలో సెంచరీని మిస్ చేసుకోగా.. షా(55), షాహిది (38) బ్యాటింగ్‌లో రాణించారు. రజితకు రెండు, లాహిరు, మతీషాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జద్రాన్‌కు లభించగా.. ఇరుజట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68